

# తీన్మార్

నేటి వాస్తవాలు ...

తెలుగు దిన పత్రిక



తీన్మార్ మెల్కొల్పు

చట్టం & న్యాయం లపై.....

తీన్మార్ తెలుగు దిన పత్రిక

తలపెట్టిన మెల్కొల్పు కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు

రచనలు, కవితలు & వ్యాసాలు

-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-

teenmaardesk@gmail.com



ములుగు | సంపుటి: 04 | సంచిక: 264 | పేజీలు : 8 | బుధవారం 1 ఏప్రిల్ 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad


## ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి

# కొత్త రూల్స్




- టోల్ ప్లాజాల వద్ద "నగదు చెల్లింపులు బంద్"
- 100 శాతం డిజిటల్ లక్ష్యం
- ఎన్‌హెచ్ఏఐ కీలక నిర్ణయం

**న్యూ ఢిల్లీ, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**
నేటి నుంచి దేశంలో అనేక కొత్త రూల్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ క్రమంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా హైవే వినియోగదారుల కోసం కీలక ప్రకటన చేసింది. నేటి నుంచి (ఏప్రిల్ 1, 2026) దేశవ్యాప్తంగా ఉన్న అన్ని టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు స్పష్టం చేసింది. టోల్ గేట్ల వద్ద - మిగతా 2లో



## లక్ష కోట్ల వృథా ఆరోపణలు అబద్ధం

- కేంద్ర అనుమతులతోనే ప్రాజెక్టు నిర్మాణం
- కాళేశ్వరంపై కేంద్ర మంత్రి వ్యాఖ్యలకు హరీశ్ రావు కౌంటర్
- బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య చీకటి ఒప్పందం అంటూ ధ్వజం

**హైదరాబాద్, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**
కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ. లక్ష కోట్ల ప్రజాధనం వృథా చేశారంటూ రాజ్యసభలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీ.ఆర్. పాటిల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో సెగలు పుట్టిస్తున్నాయి. ఈ మేరకు ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం బీఆర్ఎస్ ముఖ్య నేత, మాజీ మంత్రి హరీశ్ రావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కాళేశ్వరంపై పాటిల్, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు తేడా లేదని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లే - మిగతా 2లో




### మూసీ పునరుజ్జీవనంపై కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష

- ప్రజల భాగస్వామ్యంతోనే ప్రాజెక్టు ముందుకు
- అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశాలు

2



### 363 రోజులు చేబదుళ్లతోనే పాలన

- ఆర్బీఐ దగ్గర చేయి చాచే దుస్థితిలో ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కల్వకుంట్ల కవిత విమర్శనాస్త్రాలు

2



### తక్షణమే ఎల్‌పీజీ సరఫరా పెంచాలి

- ఆటో గ్యాస్ కొరతపై కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ
- తెలంగాణలో లక్ష ఆటోలపై ప్రభావం



### జనజీవన స్రవంతిలో కలవండి

- మావోయిస్టు అగ్రనేతలకు డీజీపీ పిలుపు
- గణపతి, సంతోష్ సహా పలువురికి కీలక సూచన

2లో

### నీటి దోపిడీపై ఏపీకి మంత్రి జూపల్లి హెచ్చరిక

- తాగునీటి కష్టాల్లోనూ జలచౌర్యం:
- నిబంధనలకు విరుద్ధంగా ఏపీ తీరు
- అక్రమ విద్యుత్ ఉత్పత్తిపై తీవ్ర ఆగ్రహం

2





### ఎనిమిది రాష్ట్రాలకు "రూ. 2,461 కోట్ల కేంద్ర గ్రాంట్లు"

- 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల
- గ్రామీణ స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యం
- పంచాయతీ రాజ్ శాఖ కీలక ప్రకటన


2



## కాకతీయ యూనివర్సిటీలో

# వ్యవస్థాగత సంక్షోభం






- మెస్ వివాదాలు - పాలనా వైఫల్యాలు
- పారదర్శకతపై పెరుగుతున్న అనుమానాలు
- ఆర్థిక లావాదేవీల గందరగోళం
- లెక్కతేలని మెస్ బిల్లులు కమిటీ నివేదికల జాప్యం..!
- కాలయాపన కోసమేనా విచారణలు..?
- విద్యార్థుల్లో మొదలైన అనుమానాలు
- ఆత్మహత్య ఘటన - అపరిష్కృత మిస్టరీ
- అవినీతిపై ఉక్కుపాదం మోపేరా.. వీసీ..?

2లో

# కాకతీయ యూనివర్సిటీలో “వ్యవస్థాగత సంక్షోభం”





**హనుమకొండ కేయు, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**

కాకతీయ యూనివర్సిటీ లో హాస్టల్ మెస్ వ్యవహారం చుట్టూ మళ్లీ వివాదాలు ముసురుకుంటున్నాయి. టెండర్ ప్రక్రియ, ఆర్థిక లావాదేవీలు, కమిటీ నివేదికలు, విద్యార్థి భద్రత వంటి అన్నింటిపైనా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇవి ఒక్కో ఘటనగా కనిపించినప్పటికీ, సమగ్రంగా పరిశీలిస్తే వ్యవస్థలోని లోపాలపై స్పష్టమైన సంకేతాలను ఇస్తున్నాయి. హాస్టల్ మెస్ నిర్వహణలో 2024లో టెండర్ లేకుండానే వ్యవహారం జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా వచ్చిన టెండర్లలో కూడా పాత సరఫరాదారులే ముందుకు వస్తున్నారనే వినికిడి. దీంతో టెండర్ ప్రక్రియ పారదర్శకతపై సందేహాలు తలెత్తుతున్నాయి. వ్యవస్థలో మార్పు నిజంగా జరిగిందా.. లేక రూపం మాత్రమే మారిందా.. అన్న ప్రశ్నలకు సమాధానం లేదు. మెస్ నిర్వహణలో ఖర్చులు అధికంగా ఉన్నప్పటికీ, వాటి లెక్కలు పూర్తిగా వెల్లడికాకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. బిల్లులపై స్పష్టత లేకపోవడం, కొనుగోలు విధానం తెలియకపోవడం, ఖర్చుల వివరాలు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలు విద్యార్థుల్లో అనుమానాలను పెంచుతున్నాయి. గతంలో వినిపించిన అక్రమాల ఆరోపణలు మళ్లీ పునరావృతమవుతాయా అనే భయం విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది. హాస్టల్ వ్యవహారంపై కమిటీలు ఏర్పాటు చేసినప్పటికీ, వాటి నివేదికలు బయటకు రాకపోవడం, బాధ్యులపై చర్యలు కనిపించకపోవడం.. పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. కమిటీలు నిజాన్ని వెలికి తీయడానికా.. లేక ఆలస్యం చేయడానికా.. అన్న ప్రశ్నలు విద్యార్థుల్లో తలెత్తుతున్నాయి. ఇదే సమయంలో, కొద్ది కాలం క్రితం హాస్టల్‌లో జరిగిన విద్యార్థి ఆత్మహత్య ఘటనపై పూర్తి స్పష్టత లేకపోవడం విద్యార్థి భద్రతపై ఆందోళనలను పెంచుతోంది. మరోవైపు, పార్ట్ టైమ్ టీచర్ల పరిస్థితి కూడా దృష్టి సారించాల్సిన అంశం. పూర్తి పనిభారం ఉన్నప్పటికీ వారికి సరైన గుర్తింపు లేకపోవడం, తక్కువ వేతనం, స్థిరత్వం లేకపోవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ఇది విద్యా నాణ్యతపై ప్రభావం చూపే అంశంగా పరిగణించాలి. ఈ నేపథ్యంలో పరిపాలనపై కూడా ప్రశ్నలు లేవుతున్నాయి. నిర్ణయాలు పారదర్శకంగా తీసుకుంటున్నారా.. లేక ప్రభావితంగా జరుగుతున్నాయా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఒత్తిళ్లు, అంతర్గత ప్రభావాలు నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయా.. అనే అంశం కూడా పరిశీలనీయమే... వైస్ ఛాన్సలర్ ముందున్న సవాలుగా స్పష్టమవుతుందని విద్యార్థులు ఆరోయిస్తున్నారు. అవినీతి ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకుంటారా.. లేక వ్యవస్థలోని ఒత్తిడికి లోనవుతారా.. చిన్న స్థాయి ఉద్యోగులపైనే చర్యలు పరిమితం అవుతాయా.. లేక బాధ్యత ఉన్న ప్రతి స్థాయిపై సమానంగా చర్యలు ఉంటాయా.. అన్నది కీలకంగా మారింది. కాకతీయ విశ్వవిద్యాలయం ఇప్పుడు ఒక మలుపు వద్ద ఉంది. సీసా మారితే సరిపోదు.. అందులోని పానీయం కూడా మారాలి. నిజమైన మార్పు నిర్ణయాల్లో కనిపించాలి. పారదర్శకత, బాధ్యత, న్యాయం  ఇవి వ్యవస్థలో ప్రతిఫలించాలని విద్యార్థులు.. విద్యార్థి సంఘాలు కోరుకుంటున్నారు.

## తక్షణమే ఎల్‌పీజీ సరఫరా పెంచాలి

**హైదరాబాద్, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**

హైదరాబాద్‌లో ఎల్‌పీజీ ఆటోరిక్షాలు ఎదుర్కొంటున్న గ్యాస్ కొరతపై కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు ఎల్‌పీజీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల కోసం డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా 100% కొనసాగించాలని కోరారు. కమర్షియల్ ఎల్‌పీజీ పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆటో ఎల్‌పీజీ రంగం తీవ్రంగా ప్రభావితమైందన్నారు. తెలంగాణలో సుమారు 1 లక్ష ఎల్‌పీజీ ఆటోరిక్షాలు రోడ్లపై నడుస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల (ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్) వాటా కేవలం 20% మాత్రమే ఉంది. ప్రైవేట్ కంపెనీలు 80% మార్కెట్‌ను ఆక్రమించాయి. రాష్ట్రవ్యాప్తంగా 110 ప్రైవేట్ ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉన్నాయి. రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు డ్రై అవుట్ పరిస్థితి నెలకొంది. ప్రజా రవాణాలో అంతరాయం, ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. ప్రైవేట్ కంపెనీలకు పీఎస్యూ ల నుంచి సరఫరా అంతరాయం ఏర్పడిందని లేఖలో మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ ఔట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ అందుబాటు ఉంచాలని విజ్ఞప్తి చేశార. ప్రైవేట్ కంపెనీలకు తక్షణ సరఫరా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.75, ప్రైవేట్ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.93 వరకు విక్రయిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై నియంత్రణ చర్యలు అవసరమని కేంద్రం తక్షణ జోక్యం వల్ల ప్రజా రవాణా సేవలు నిలకడగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## ఆర్టీసీ ప్రగతిపై మంత్రి పొన్నం సమీక్ష

**మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ. 10 వేల కోట్ల ఆదా**

**అద్భుత ఫలితాలిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం**

**290 కోట్ల మంది మహిళల ప్రయాణం**



**హైదరాబాద్, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**

తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన గుర్తుచేశారు. డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళా ప్రయాణికులను కేవలం ప్రయాణికులుగా మాత్రమే కాకుండా, వారిని ఆర్టీసీకి యజమానులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 లక్షల మంది మహిళలే ఉంటున్నారని 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఆర్టీసీని రాష్ట్రంలోని ప్రతి మూలకు చేర్చేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా కొత్త రూట్లు, కొత్త బస్సులు, బస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 340 కొత్త రూట్లలో బస్సులను ప్రారంభించామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమంపై స్పందిస్తూ సీసీఎస్, పీఎఫ్ బకాయిలను తీరుస్తున్నామని, యూనియన్ల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని, యూనియన్ల పేరుతో రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణకు ఆర్టీసీయే లైఫ్ లైన్ అని ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ అగ్రస్థానంలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## నీటి దోపిడీపై ఏపీకి మంత్రి జూపల్లి హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**

శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా ఆంధ్రప్రదేశ్ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ మా పంటలు ఎండుతుంటే మీరు ఎలా విద్యుత్ ఉత్పత్తి చేస్తారని మండిపడ్డారు. తాగడానికి కూడా నీళ్లు లేకుండా చేస్తారా అని నిలదీశారు. మంగళవారం గాంధీ భవన్?లో మీడియాతో మాట్లాడిన ఆయన నీటి నిల్వలు తక్కువగా ఉంటే విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలనే నిబంధనలు ఉన్నా ఏపీ మాత్రం అందుకు భిన్నంగా అక్రమంగా నీటిని వాడుతోందని దుయ్యబట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయిందని, మేం ధర్నా చేస్తాం అనే వరకు నీళ్లు దోచుకుందన్నారు. నాడు మేము హైకోర్టుకు వెళ్లడంతో హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనలకు అనుగుణంగా శ్రీశైలంలో అక్రమంగా నీటిని తరలించడాన్ని ఆపాలని ఏపీ ప్రభుత్వానికి మంత్రి జూపల్లి హెచ్చరించారు.

**మీరేమైనా చదువురాని వాళ్లా?:**

శ్రీశైలంలో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల రైతుల హక్కులు కాలరాస్తే ఊరుకోబోమన్నారు. ఏపీ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరిస్తున్నామన్నారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు ఇంకా జరగలేదన్నారు. ఈ విషయంలో సమాచారం ఇవ్వక పోవడానికి ఏమైనా చదువురాని వారా? జీవోలు ఉన్నాక ఇంకా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏముందన్నారు. తెలంగాణ ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసిందని, ఏపీ చట్టప్రకారం నడుచుకోవాలన్నారు. అక్రమాలకు పాల్పడవద్దన్నారు. లేదా రైతాంగం, ప్రభుత్వం, పార్టీ సమిష్టిగా పోరాటం చేసి మా హక్కులను కాపాడుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. గత ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీ పట్టించుకోలేదని, గత ప్రభుత్వ తప్పిదాలను ఏపీ అలుసుగా తీసుకుంటోందని ధ్వజమెత్తారు.

## హనుమాన్ విజయ యాత్రకు

## “3,000 మంది పోలీసులతో భారీ భద్రత”

**వివిధ శాఖలతో సీపీ సజ్జనర్ సమావేశం**




**హైదరాబాద్, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**

రేపు జరగనున్న శ్రీ హనుమాన్ జయంతి శ్రీ వీర హనుమాన్ విజయ యాత్రను అత్యంత ప్రశాంతంగా, దిగ్విజయంగా నిర్వహించేందుకు నగర పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ యాత్ర ఏర్పాట్లపై కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారి అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖలు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఇటీవల జరిగిన శ్రీరామ నవమి శోభాయాత్రను అన్ని శాఖల సహకారంతో విజయవంతంగా పూర్తి చేసినట్లే, హనుమాన్ విజయ యాత్రను కూడా శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈసారి ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 3,000 మంది పోలీసు సిబ్బందితో పాటు అదనపు సాయుధ బలగాలు, టాస్క్ ఫోర్స్ బృందాలను కీలక ప్రాంతాల్లో మోహరిస్తున్నట్లు వెల్లడించారు. యాత్ర నిర్వహణలో వాలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. యాత్రలో కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నిర్ణీత మార్గాల్లోనే యాత్ర సాగేలా చూడాలని కోరారు. ఫ్లైఓవర్లు, రైల్వే బ్రిడ్జిల దృష్ట్యా విగ్రహాల ఎత్తు విషయంలో జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మళ్లింపులు చేపడతామని, ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశం అనంతరం సీపీ గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకుని అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల యాత్ర మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి కొత్త రూల్స్

-మొదటిపేజీ తరువాయి

వాహనాల రద్దీని తగ్గించడానికి, ప్రయాణ సమయాన్ని ఆదా చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఫాస్టాగ్ లేని వారు నగదు రూపంలో రెట్టింపు టోల్ చెల్లించి వెళ్లే వెసులుబాటు ఉండేది కానీ ఈరోజు నుంచి ఆ విధానానికి స్వస్తి పలకనున్నారు. ఇకపై టోల్ రుసుములను కేవలం ఫాస్టాగ్, యూపీఐ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఫాస్టాగ్ పని చేయకపోయినా లేదా బ్యాలెన్స్ లేకపోయినా, వాహనదారులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి యూపీఐ ద్వారా తక్షణమే చెల్లింపులు చేయవచ్చు. నగదు లావాదేవీల వల్ల జరుగుతున్న జాప్యాన్ని నివారించి, డిజిటల్ చెల్లింపులను 100 శాతం అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ మార్పులు చేపట్టింది. వాహనదారులు ప్రయాణానికి ముందే తమ ఫాస్టాగ్ వాలెట్‌ను రీఛార్జ్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## జనజీవన స్రవంతిలో కలవండి

**హైదరాబాద్, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**

‘హింసకు భవిష్యత్తు లేదు, శాంతికి మాత్రమే ఉంది’ అంటూ మావోయిస్టు అగ్రనేతలకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మరోసారి కీలక విజ్ఞప్తి చేశారు. అజ్ఞాతంలో ఉన్న నేతలు ఆయుధాలు వీడి, గౌరవప్రదమైన జీవితాన్ని ఎంచుకోవాలని కోరుతూ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ‘ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, వార్తా శేఖర్ అలియాస్ మంగ్తూ, జోడే రత్నబాయి అలియాస్ సుజాత, నక్కా సుశీల అలియాస్ రేల, రంగబోయిన భాగ్య అలియాస్ రూపి వీరంతా తక్షణమే ఆయుధాలు వీడి, తమ కుటుంబాల వద్దకు తిరిగి రావాలని, రక్షణ మరియు భద్రతతో కూడిన మెరుగైన జీవితాన్ని ప్రారంభించాలని కోరారు. గడిచిన రెండేళ్లలో ప్రభుత్వ పునరావాస విధానంపై నమ్మకంతో 721 మంది మావోయిస్టులు లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసినట్లు తెలిపారు. వారంతా ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో తమ జీవితాలను కొత్తగా నిర్మించుకుంటున్నారని పేర్కొన్నారు. లొంగిపోయే వారికి కేవలం పునరావాసం మాత్రమే కాకుండా, గౌరవం, అవకాశాలు, సంరక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అధునాతన వైద్య చికిత్సలను అందిస్తామని ప్రత్యేకంగా భరోసా ఇచ్చారు. మీ క్షేమం మాకు ముఖ్యం. హింసను వీడి అభివృద్ధి, ప్రజాస్వామ్యం మరియు మెరుగైన రేపటి కోసం కలిసి నడుద్దాం అని ప్రభుత్వం పిలుపునిచ్చారు.

## మూసీ పునరుజ్జీవనంపై కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష

**హైదరాబాద్, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ మంగళవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో ముఖ్యంగా ప్రాజెక్టు పురోగతి, ప్రజల భాగస్వామ్యంపై సుదీర్ఘంగా చర్చించారు. మూసీ ప్రాజెక్టు రూపకల్పన, అమలులో ప్రజల అభిప్రాయాలను, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు కేవలం ప్రభుత్వ నిర్ణయం మాత్రమే కాకుండా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలని మంత్రులు అభిప్రాయపడ్డారు. సరిగ్గా నేటి నుంచి ఏప్రిల్ 15 వరకు ప్రజలు తమ సలహాలను, సూచనలను ప్రభుత్వానికి పంపవచ్చని కమిటీ వెల్లడించింది. ప్రాజెక్టుపై అభిప్రాయాలు ఉన్నవారు ఎబంతీఅతీఒఎఎస్త్రఖ్ఱశ్రీ.ఏశీఎ అనే అధికారిక ఇమెయిల్ ఐడీకి తమ సూచనలను పంపాలని కేబినెట్ సబ్ కమిటీ కోరింది. మూసీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, పునరావాస ప్యాకేజీలు, అభివృద్ధి పనుల విషయంలో పారదర్శకత పాటించాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మూసీ నదికి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ప్రజలు ఇచ్చే నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు ప్రాజెక్టు విజయవంతానికి ఎంతో దోహదపడతాయని కేబినెట్ సబ్ కమిటీ తెలిపింది.

## 363 రోజులు చేబదుళ్లతోనే పాలన

**హైదరాబాద్, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**

తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని అప్పుల్లో నెట్టుకొస్తోందన్న కాగ్ నివేదికగాపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, కల్వకుంట్ల కవిత స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా కీలక పోస్టు పెట్టారు. రాష్ట్ర రోజువారీ ఖర్చులకు ఆర్బీఐ దగ్గర చేయి చాచాల్సిన దుస్థితిలోకి తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం నెట్టేసింది. కాగ్ 2024 – 25 నివేదిక రాష్ట్ర ఖజానా పరిస్థితిని బట్టబయలు చేసింది. ఏడాదిలో రెండు రోజులు తప్ప మిగిలిన 363 రోజులు రిజర్వ్ బ్యాంకు నుంచి వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్, స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీస్, ఓవర్ డ్రాఫ్టుల పేరుతో చేబదుళ్లు చేసింది. 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో ఇలా రూ.1.30 లక్షల కోట్లు తెచ్చి సర్కారును నెట్టుకొచ్చింది. చేబదులుగా తెచ్చిన మొత్తాన్ని ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా తిరిగి చెల్లించాల్సి ఉండగా 2025 మార్చి 31 నాటికి సుమారు రూ.6 వేల కోట్లు చెల్లించలేకపోయింది. నెలకు సుమారు రూ.12 వేల కోట్ల సొంత ఆదాయం ఉన్న మన రాష్ట్ర ఖజానాలో రోజువారీ ఖర్చులకు రూ.1.38 కోట్ల బ్యాలెన్స్ కూడా మెయింటేన్ చేయలేని స్థితికి తెలంగాణను తీసుకెళ్లింది. రూ.8.65 లక్షల కోట్ల అప్పులు తెచ్చి ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పు మోపిన కాంగ్రెస్ ప్రభు త్వం రోజువారీ ఖర్చులకు ఆర్బీఐ దగ్గర చేయి చాపుతూ ఇంకా మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రమని చెప్పడం ప్రజలను మోసం చేయడమే. ఎన్నికలకు ముందు సంపద పెంచుతాం, దానిని పేదలకు పంచుతాం అన్న కాంగ్రెస్ నాయకుల మాటలు వట్టి డొల్ల అని కాగ్ నివేదికతో బట్టబయలు అయ్యింది’ అని కవిత కీలక వ్యాఖ్యలు చేశారు.

## లక్ష కోట్ల వృథా ఆరోపణలు అబద్ధం

-మొదటిపేజీ తరువాయి

అంశంలో కాంగ్రెస్, బీజేపీల అనుబంధం బయటపడిందని హరీష్ రావు అన్నారు. కాళేశ్వరంపై రూ. 90 వేల కోట్లు ఖర్చు చేస్తే రూ. లక్ష కోట్లు కొట్టుకుపోయాయని అంటున్నారని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులు కేంద్ర ప్రభుత్వమే ఇచ్చిందని గుర్తు చేశారు. గతంలో కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయిని అని మరో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. కాళేశ్వరంతో పంటల ఉత్పత్తి రెట్టింపు అయ్యిందని ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక సర్వేలు కూడా చెప్పాయని చురకలంటించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టే కొట్టుకుపోతే మల్లన్న సాగర్‌లో 25 టీఎంసీల నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. దమ్ముంటే బీజేపీ, కాంగ్రెస్ నేతలు తమతో రావాలని, కాళేశ్వరం జలాలతో గలగలా పారుతున్న గోదావరి నీళ్లను, పండుతున్న పొలాలను చూపిస్తామని సవాల్ విసిరారు.

## ఎనిమిది రాష్ట్రాలకు

## “రూ. 2,461 కోట్ల కేంద్ర గ్రాంట్లు”

**న్యూ ఢిల్లీ, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**

కేంద్రం ఎనిమిది రాష్ట్రాలకు 15వ ఆర్థిక సంఘం గ్రాంట్ల కింద 2,461 కోట్ల రూపాయలకు పైగా పంపిణీ చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మధ్యప్రదేశ్, పంజాబ్ మరియు సిక్కింలలోని గ్రామీణ స్థానిక సంస్థలకు అనుసంధానిత గ్రాంట్లను విడుదల చేసింది. అలాగే హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం మరియు త్రిపురలకు అనుసంధానిత మరియు అనుసంధానితం కాని గ్రాంట్ల రెండింటిలోనూ నిలిపివేసిన భాగాలను కూడా విడుదల చేసింది. ఈ విడుదల వివిధ ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన కేటాయింపులను కలిగి ఉంది మరియు గ్రామీణ స్థానిక పాలనను మరింత బలోపేతం చేయడమే దీని లక్ష్యం. మధ్యప్రదేశ్‌కు 945 కోట్ల రూపాయలకు పైగా, గుజరాత్‌కు 764 కోట్లకు పైగా, ఛత్తీస్‌గఢ్‌కు సుమారు 387 కోట్లు, పంజాబ్‌కు 332 కోట్లకు పైగా, ఒడిశాకు 35 కోట్లకు పైగా, హిమాచల్ ప్రదేశ్‌కు సుమారు 14 కోట్లు, సిక్కింకు 10 కోట్లకు పైగా మరియు త్రిపురకు 68 లక్షల రూపాయలకు పైగా విడుదల చేసినట్లు పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ తెలిపింది.

# అన్ని మతాలు సహనాన్ని, శాంతిని బోధిస్తాయి’

పశ్చిమాసియాలో యుద్ధం అంతకంతకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో టిబెట్ బౌద్ధమత ఆధ్యాత్మిక గురువు, నోబెల్ గ్రహీత దలైలామా కీలక వ్యాఖ్యలు చేశారు. అన్ని మతాలు సహనాన్ని, శాంతిని బోధిస్తాయని తెలిపారు. హింసను ఖండిస్తాయని పేర్కొన్నారు. ఏ ఆధ్యాత్మిక సంప్రదాయంలోనూ హింసకు స్థానం లేదని వెల్లడించారు. అలాగే, మతాల మధ్య కరుణ, సహనం, సామరస్యం వంటి ఉమ్మడి విలువలను ప్రముఖంగా ప్రస్తావించారు. పశ్చిమాసియాలో శాంతి కోసం ఇటీవలే పోప్ లియో–14 చేసిన విజ్ఞప్తిని దలైలామా పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. “పామ్ సండే ప్రార్థనల సందర్భంగా పోప్–14 శాంతి కోసం శక్తివంతమైన విజ్ఞప్తిని నేను మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నాను. శాంతి కోసం ఆయుధాలను విడిచిపెట్టాలని, హింసను త్యజించాలని ఆయన చేసిన పిలుపు నన్ను ఎంతగానో కదిలించింది. ఎందుకంటే అన్ని ప్రధాన మతాలు ఇదే సారాంశాన్ని భోదిస్తాయి. క్రైస్తవ మతం, బౌద్ధ మతం, ఇస్లాం, హిందూ మతం, యూదు మతం లేదా ప్రపంచంలోని ఏ గొప్ప ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని చూసినా వాటి సందేశం ప్రాథమికంగా ఒక్కటే. ప్రేమ, కరుణ, సహనం ఆత్మ నిగ్రహం. ఈ మతాల బోధనలలో దేనిలోనూ హింసకు స్థానం లేదు. హింస మరింత హింసను మాత్రమే సృష్టిస్తుంది. అది శాంతికి ఎప్పటికీ శాశ్వత పునాది కాదని చరిత్ర మనకు పదేపదే తెలియజేసింది. “ అని దలైలామా అభిప్రాయపడ్డారు.

**యావత్ ప్రపంచ ప్రజలు శాంతి కోసం కృషి చేయాలి : దలైలామా**

ప్రపంచ ఐక్యతకు టిబెట్ బౌద్ధమత ఆధ్యాత్మిక గురువు



దలైలామా పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు శాంతి కోసం కృషి చేయాలని కోరారు. పశ్చిమాసియా సహా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న హింస, సంఘర్షణలు త్వరగా ముగియాలని ఆకాంక్షించారు. “పశ్చిమాసియా, రష్యా–ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న సంఘర్షణలకు శాశ్వత పరిష్కారం చర్చలు, దౌత్యం, పరస్పర గౌరవంపై ఆధారపడి ఉంటుంది. మనమందరం తోబుట్టువులమనే అవగాహనతో ఈ సంఘర్షణలను పరిష్కరించుకోవాలి.” అని దలైలామా అభిప్రాయపడ్డారు.

**శాంతికి పిలుపునిచ్చిన పోప్**

కొద్ది రోజుల క్రితం రోమ్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన పామ్ సండే ప్రార్థనల సందర్భంగా పశ్చిమాసియా సంక్షోభం గురించి పోప్ లియో–14 పరోక్షంగా స్పందించారు. యుద్ధం చేసేవారి ప్రార్థనలను దేవుడు (యేసు క్రీస్తు) ఆలకించడని అన్నారు. పైగా ఆ ప్రార్థనలను తిరస్కరిస్తాడని చెప్పారు. పీడితుల పక్షాన దేవుడు నిలుస్తాడని తెలిపారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా శాంతికి పిలుపునిచ్చారు.

**జీసస్ యుద్ధాన్ని తిరస్కరిస్తాడు : పోప్ లియో–14**

“సోదర సోదరీమణులారా మన దేవుడు యేసు శాంతికే రాజు. ఆయన యుద్ధాన్ని తిరస్కరిస్తాడు. యుద్ధాన్ని సమర్థించుకోవడానికి యేసును ఎవరూ ఉపయోగించుకోలేరు. జీసస్ యుద్ధం చేసేవారి ప్రార్థనలను వినడు. వాటిని తిరస్కరిస్తాడు. పశ్చిమాసియాలోని క్రైస్తవుల కోసం నేను ప్రత్యేకంగా ప్రార్థిస్తున్నాను. వారు ఈ పవిత్ర దినాల ఆచారాలను పాటించలేకపోతున్నారు.” అని పోప్ లియో–14 పేర్కొన్నారు. ఈ క్రమంలో పోప్ చేసిన శాంతి విజ్ఞప్తిని దలైలామా సమర్థిస్తూ సోషల్ మీడియాలో తాజాగా పోస్ట్ పెట్టారు. పోప్ లియో–14 చేసిన వ్యాఖ్యలపై స్పందించని అమెరికా వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి కరోలిన్ లివిట్‌ను విలేకరులు అడిగారు. ఈ క్రమంలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. “అమెరికా దాదాపు 250 ఏళ్ల క్రితం యూదు–క్రైస్తవ విలువలే పునాదిగా స్థాపితమైంది. యూఎస్ చరిత్రలో అత్యంత కష్టకాలాల్లో అధ్యక్షులు, యుద్ధ శాఖ అధిపతులు, దేశ సైనికులు ప్రార్థనలు చేయడం మనం చూశాం. అమెరికా సైన్యాధిపతి గానీ, స్వయంగా అధ్యక్షుడు గానీ దేశ సైనికుల కోసం, అలాగే విదేశాల్లో ఉంటూ మన దేశానికి సేవలందిస్తున్న వారి కోసం ప్రార్థించమని అమెరికన్ ప్రజలకు పిలుపునివ్వడంలో ఎటువంటి తప్పు ఉందని నేను భావించడం లేదు. వాస్తవానికి అది ఒక అత్యంత గొప్ప కార్యమని నేను భావిస్తున్నాను” అని కరోలిన్ లివిట్ అభిప్రాయపడ్డారు.

# బంగాల్‌లో రాజకీయ వారసులదే హవా

మమతా బెనర్జీ నుంచి బుద్ధదేవ్ భట్టాచార్జీ వరకు, సోమేన్ మిత్రా, ప్రియా రంజన్ దాస్ మున్షీ నుంచి బిమన్ బోస్ వరకు బంగాల్‌కు చెందిన ఎందరో ప్రముఖ నేతలు విద్యార్థి రాజకీయాలు, కార్మిక పోరాటాలు, ప్రజా ఉద్యమాల ద్వారానే ఎదిగారు. కానీ ఇప్పుడీ రాష్ట్రంలోనూ రాజకీయ సంస్కృతి మారుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ సహా అన్ని పార్టీల్లోనూ వారసత్వ రాజకీయాల జాడ కనిపిస్తోంది. ఈసారి ఈ పార్టీలన్నీ ఎంతోమంది రాజకీయ వారసులకు సగౌరవంగా అసెంబ్లీ టికెట్లను ఇచ్చుకున్నాయి. పార్టీలవారీగా టికెట్లను పొందిన ప్రముఖ రాజకీయ వారసులు ఎవరు? వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించాల్సిన అనివార్య స్థితికి పార్టీలు ఎందుకు చేరాయి? స్వశక్తితో ఎదిగే కొత్త తరం నేతల పరిస్థితేంటి? ఈ కథనంలో తెలుసుకుందాం.

**గతమెంతో ఘనం : దారితప్పిన రాజకీయం**

గతంలో బంగాల్ పాలిటిక్స్ యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచేవి. ఈ రాష్ట్రాన్ని వివిధ కాలాల్లో దాదాపు 25 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ పాలించింది. ఇక వామపక్ష కూటమి (లెఫ్ట్ ఫ్రంట్) వరుసగా 34 సంవత్సరాల పాటు (1977 నుంచి 2011 వరకు) పాలించింది. అప్పట్లో బంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ కానీ, వామపక్షాలు కానీ వారసత్వ రాజకీయాలను పెద్దగా ప్రోత్సహించేవి కావు. ఈ కారణం వల్లే ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని మమతా బెనర్జీ, బుద్ధదేవ్ భట్టాచార్జీ, సోమేన్ మిత్రా, ప్రియా రంజన్ దాస్ మున్షీ, బిమన్ బోస్ లాంటి నేతలకు ఎన్నికల్లో పోటీచేసే అవకాశాలు లభించాయి. కానీ ఇప్పుడు బంగాల్‌లో అన్ని పార్టీలూ ఇంటి పేరును, రాజకీయ నేపథ్యాన్ని, ధన బలాన్ని చూసి అసెంబ్లీ టికెట్లు ఇవ్వడం మొదలుపెట్టాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీలు విడుదల చేసిన అభ్యర్థుల జాబితాల్లో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోంది. వాటిలో రాజకీయ ప్రముఖుల కుమారులు, కుమార్తెలు, సోదరులు, జీవిత భాగస్వాముల పేర్లు ఎన్నో కనిపిస్తున్నాయి.

**వారసత్వ రాజకీయాలపై పార్టీల యూటర్న్**

“ఒకప్పుడు వారసత్వ రాజకీయాలను చాలా వరకు పార్టీలు విమర్శించేవి. కానీ ఇప్పుడు ఏ పార్టీ కూడా వాటిని విమర్శించే స్థితిలో లేదు. ఎందుకంటే అన్ని పార్టీలూ వారసత్వ రాజకీయాలకే పెద్దపీట వేస్తున్నాయి. రాజకీయ నేపథ్యం కలిగిన గెలుపు గుర్రాలను (అభ్యర్థులను) తప్ప మరే విషయాన్ని పార్టీలు పెద్దగా పట్టించుకోవడం లేదు. వారసత్వ రాజకీయాలకు తాము వ్యతిరేకమని గట్టిగా చెప్పుకునే బీజేపీ, వామపక్షాలు కూడా ఇప్పుడు యూటర్న్ తీసుకున్నాయి. అందువల్లే బంగాల్ రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. ఒకప్పుడు రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజా ఉద్యమాల నుంచి నేతలు ఎదిగేవారు. ఇప్పుడు కూడా అలాంటి ప్రజా నేతలున్నా, రాజకీయ పార్టీలు వాళ్లకు ఎన్నికల్లో పోటీచేసే



అవకాశాలను ఇవ్వడం లేదు” అని కోల్‌కతాకు చెందిన రాజకీయ విశ్లేషకుడు సుమన్ భట్టాచార్య తెలిపారు.

**విద్యార్థి యూనియన్లు బలహీనపడటంతో రాజకీయ శూన్యత**

“ప్రత్యేకించి బంగాల్‌లోని యూనివర్సిటీల విద్యార్థి యూనియన్లు బాగా బలహీనపడ్డాయి. ఇందువల్లే రాజకీయాల్లోకి ప్రవేశించే కొత్తతరం సంఖ్య తగ్గిపోయింది. రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఏర్పడింది. ఒకప్పుడు జిల్లా స్థాయి నేత, విద్యార్థి నేత కూడా ఎమ్మెల్యే కావాలని కలలు కనేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎన్నికలు డబ్బుమయం అయ్యాయి. రాజకీయ వారసత్వం కలిగిన వారికి ధన బలం ఉంటుంది. దానితో వాళ్లు పార్టీల టికెట్‌లను సాధిస్తున్నారు. ఎన్నికల్లో పోటీచేసి గెలుస్తున్నారు. పార్టీలు కూడా ఇలాంటి వాళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నాయి” అని రాజకీయ విశ్లేషకుడు సుమన్ భట్టాచార్య చెప్పారు.

**గెలుపు అవకాశాల ప్రకారమే టికెట్ల కేటాయింపు : టీఎంసీ వర్గాలు**

“ఇప్పుడు అసెంబ్లీ టికెట్ల కేటాయింపు ప్రమాణాలు మారిపోయాయి. సైద్ధాంతికతతో పాటు పార్టీకి విధేయత, సుస్థిరమైన ప్రజా నెట్‌వర్క్ ఉన్నవారికే టికెట్లను ఇస్తున్నారు. ప్రజలు వారసత్వ రాజకీయాలను విమర్శిస్తుంటారు. కానీ అభ్యర్థులకు టికెట్లు ఇచ్చేటప్పుడు రాజకీయ పార్టీలు ప్రధానంగా ఆలోచించేది, ఎన్నికల్లో గెలుపు అవకాశాల గురించే. ఎవరైనా రాజకీయ నేతకు కుటుంబం ద్వారా నియోజకవర్గంలో ఇప్పటికే పట్టు ఉంటే, పార్టీ దాన్ని ఒక అడ్వాంటేజీగా పరిగణిస్తుంది. ప్రజా గుర్తింపు, కార్యకర్తల ఫాలోయింగ్ ఉన్నవాళ్లకే టికెట్లు లభిస్తాయి” అని పలువురు టీఎంసీ పార్టీ సీనియర్ నేతలు ఈటీవీ భారత్?తో చెప్పుకొచ్చారు.

**2026 పోల్స్ : బీజేపీ టికెట్లు పొందిన రాజకీయ వారసులు**

పూర్వ మేదినీపూర్ జిల్లాలోని ఎగ్రా అసెంబ్లీ స్థానాన్ని దివ్యేందు అధికారికి బీజేపీ కేటాయించింది. ఈయన సాక్షాత్తూ బీజేపీ నేత సువేందు అధికారి తమ్ముడే. సువేందు అధికారి సైతం ఈ ఎన్నికల్లో నందిగ్రామ్, భవానీపూర్ స్థానాల్లో పోటీ చేస్తున్నారు. అంటే ఒక్క కుటుంబానికే బీజేపీ 3 అసెంబ్లీ టికెట్లు ఇచ్చుకుంది.

గైఘాటా సిట్టింగ్ ఎమ్మెల్యే సుబ్రతా ఠాకూర్ ఈసారి మతువా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఈయన కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ శాంతను ఠాకూర్ సోదరుడు. పలుకుబడిగల ఠాకూర్ కుటుంబానికి చెందినవారు. ఇక బగ్దా నుంచి బీజేపీ అభ్యర్థిగా శాంతను ఠాకూర్ భార్య సోమా పోటీ చేస్తున్నారు. ఈ స్థానంలో సోమాతో స్వయంగా ఆమె వదిన మధుపర్ణ (టీఎంసీ) తలపడుతున్నారు.

మాజీ ఎంపీ అర్జున్ సింగ్ కుమారుడు పవన్ సింగ్‌కు భట్‌పారా స్థానాన్ని బీజేపీ కేటాయించింది. ఇక అర్జున్ సింగ్ నోవాపారా స్థానం నుంచి పోటీ చేయనున్నారు.

బారానగర్ అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా సజల్ ఘోష్ బరిలోకి దిగారు. ఈయన కాంగ్రెస్ మాజీ నాయకుడు ప్రదీప్ ఘోష్ కుమారుడు.

**వ్యక్తులకు పార్టీల్లో ప్రాధాన్యత పెరిగింది : బీజేపీ వర్గాలు**

“బంగాల్‌లో రాజకీయాలు చాలా మారాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు వ్యక్తులకు పార్టీల్లో ప్రాధాన్యత పెరిగింది. అందుకే రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబాలకు టికెట్ల కేటాయింపులో ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది” అని సీనియర్ బీజేపీ నేత ఒకరు చెప్పారు.

**కాంగ్రెస్ టికెట్లు పొందిన రాజకీయ వారసులు**

బంగాల్‌లో ఉనికిని చాటుకునేందుకు పోరాడుతున్న కాంగ్రెస్ కూడా వారసత్వ రాజకీయాలకే ప్రాధాన్యతను ఇస్తోంది.

కాంగ్రెస్ దిగ్గజం ఏబీఏ ఘనీ ఖాన్ చౌదరి మేనకోడలు, మాజీ ఎంపీ మౌసమ్ నూర్ గతంలో టీఎంసీ పార్టీలో ఉండేవారు. ఆమె ఈసారి మాలతీపూర్ అసెంబ్లీ స్థానం కోసం కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. “ఇది భావోద్వేగభరితమైన క్షణం. నా సొంత ఇంటికి మళ్లీ వచ్చినట్టుగా ఉంది. మా కుటుంబాన్ని ఏకం చేసి, ఘనీ ఖాన్ చౌదరి వారసత్వాన్ని బలోపేతం చేయాలని భావిస్తున్నాను” అని మౌసమ్ నూర్ పేర్కొన్నారు.

పురులియాలోని బగ్ముండి స్థానంలో కాంగ్రెస్ మాజీ ఎంపీ దేబేంద్ర మహతో కుమారుడు నేపాల్ మహతోను బరిలోకి దింపారు. బల్లిగంజ్ స్థానంలో మాజీ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సోమేన్ మిత్రా కుమారుడు రోహన్ మిత్రాకు టికెట్‌ను కేటాయించారు. ఉత్తర బంగాల్‌లోని గోల్‌పోఖర్ స్థానం నుంచి అలీ ఇమ్రాన్ రామ్జ్ పోటీ చేస్తున్నారు. ఆయన మాజీ ఫార్వర్డ్ బ్లాక్ ఎమ్మెల్యే మహమ్మద్ రంజాన్ అలీ కుమారుడు.

2026 పోల్స్ : సీపీఎం టికెట్లు పొందిన రాజకీయ వారసులు

వామపక్షాలు ఒకప్పుడు వారసత్వ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించేవి. కానీ ఇప్పుడవి యూటర్న్ తీసుకున్నాయి.

రాజర్‌హాట్–న్యూ టౌన్ స్థానంలో మాజీ మంత్రి గౌతమ్ దేబ్ కుమారుడు సప్తర్షి దేబ్‌కు సీపీఎం టికెట్‌ను కేటాయించింది. మాజీ ఎమ్మెల్యే పద్మా నిధి ధర్ మనవరాలు దీప్సితా ధర్ నార్త్ దమ్ దమ్ స్థానం నుంచి సీపీఎం తరఫున పోటీ చేస్తున్నారు.

# బంగాల్‌లో ఓటర్ల హక్కులకు ముప్పు

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో నిజమైన ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు మూడు పేజీల లేఖ రాసిన మమత, ఈసీ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. “ఒక రాజ్యాంగ సంస్థ నుంచి ఆశించే ప్రమాణాలు ఇవి కావు” అని ఆమె లేఖలో స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడం ఈసీ బాధ్యత అని గుర్తుచేశారు. ఇక బంగాల్‌లో ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరుగగా, మే 4న ఫలితాలు వెల్లడించనున్నారు. ఇదే సమయంలో, బీజేపీపై కూడా మమతా ఘాటు విమర్శలు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ ఓటర్లను బంగాల్ ఓటర్ల జాబితాలో చేర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బిహార్, రాజస్థాన్, హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

**బీజేపీకి బంగాల్ ప్రజలపై గౌరవం లేదు!**

పశ్చిమ మేదినిపుర్ జిల్లా చంద్రకోణాలో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడిన మమతా, ఒక్క రోజులోనే సుమారు 30 వేల కొత్త ఓటర్ల నమోదు ఫారాలు సమర్పించారని తెలిపారు. దీనిపై సమాచారం అందడంతో అభిషేక్ బెనర్జీ తన ప్రచారాన్ని మధ్యలో వదిలి ఈసీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. బీజేపీకి బంగాల్ ప్రజలపై గౌరవం లేదని, ఎన్నికల్లో గెలవడానికి ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉందని మమతా విమర్శించారు. ూ×= ప్రక్రియ పేరుతో మహిళలు, మైనారిటీల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు.

**నాన్ వెజ్‌పై నిషేధం విధించే ప్రమాదం**

“బీజేపీ, ఈసీ కలిసి ప్రజల పౌరసత్వం, రాజ్యాంగ హక్కులను లాక్కుంటున్నాయి. దీనికి వ్యతిరేకంగా మేము చివరి వరకు పోరాడుతాం” అని మమత స్పష్టం చేశారు. అలాగే, బీజేపీ అధికారంలోకి వస్తే బంగాల్? ప్రజల ఆహారపు అలవాట్లపై కూడా నియంత్రణలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యేకంగా నాన్–వెజ్ ఆహారంపై నిషేధం విధించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చీ=జ అమలు చేయాలని చూస్తోందని, అయితే తమ ప్రభుత్వం ఉన్నంత కాలం బంగాల్?లో చీ=జకి అనుమతి ఇవ్వబోమని మమత తేల్చి చెప్పారు. డిటెన్షన్ క్యాంపుల ఏర్పాటుకు కూడా తాము వ్యతిరేకమని తెలిపారు. ఇంకా బ్యాంకురా, బిష్ణుపుర్, గర్బేటా ప్రాంతాల్లో జరిగిన సభల్లో మమతా బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షలాది నిజమైన ఓటర్ల పేర్లు తొలగించారని, అల్లర్లకు ప్రోత్సాహం ఇచ్చారని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను అడ్డుకున్నారని ఆరోపించారు.

బంగాలీ మాట్లాడే వలస కార్మికులను వేధిస్తోందంటూ!

బీజేపీ ఒక బార్బరిక్ పార్టీ అని, బంగాలీ మాట్లాడే వలస కార్మికులను వేధిస్తోందని మమతా విమర్శించారు. బెంగాల్ యువత ప్రతిభ, సంస్కృతి, విజయాలపై బీజేపీకి అసూయ ఉందని వ్యాఖ్యానించారు. తనను కొనుగోలు చేయలేరనే కారణంతోనే బీజేపీ నాయకులు తనను ద్వేషిస్తున్నారని కూడా మమతా పేర్కొన్నారు. ఇక ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థులెవరో పట్టించుకోకుండా, తానే అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థినిగా భావించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. మరోవైపు, బీజేపీ నకిలీ ఓటర్ల నమోదు చేసిందంటూ టీఎంసీ ఆరోపించిన నేపథ్యంలో విచారణ జరుపుతామని బంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్ తెలిపారు.

## తెలంగాణలో చికెన్ షాపులు బంద్

**ఏప్రిల్ 1 నుంచి విక్రయాలు నిలిపివేత**

**మార్జిన్ తగ్గింపుపై యజమానుల ఆగ్రహం**

**ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన**



హైదరాబాద్, మార్చి 31 (తీన్మార్ న్యూస్):

వ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి తెలంగాణ రాష్ట్రంలో చికెన్ షాపుల బంద్‌కు చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అలాగే హైదరాబాద్ మహా నగరంలో కూడా చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరగనుంది. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే కమీషన్ మార్జిన్‌ను తగ్గించడం వల్ల తీవ్ర నష్టాలు వస్తున్నాయని చికెన్ షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 1.8 గా ఉన్న మార్జిన్‌ను ప్రస్తుతం 1.5కి తగ్గించడమే ఈ బంద్‌కు ప్రధాన కారణమని వారు పేర్కొన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చికెన్ షాపుల యజమానులందరూ ఈ బంద్‌లో పాల్గొని, దీనిని విజయవంతం చేయాలని నాచారం అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మార్జిన్ పెంపుపై పౌల్ట్రీ కంపెనీలు స్పందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. అలాగే అసోసియేషన్ నిర్ణయాన్ని కాదని షాపులు తెరిచే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా తెలంగాణ చికెన్ షాప్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది.

## హెచ్ఎండీఏకి బాంబు బెదిరింపు

**నగరంలో తీవ్ర కలకలం.. ఈ-మెయిల్ ద్వారా హెచ్చరిక**

**ఉలిక్కిపడ్డ అధికారులు.. రంగంలోకి బాంబు స్క్వాడ్**

**ఐపీ అడ్రస్ వేటలో సైబర్ క్రైమ్ పోలీసులు**



హైదరాబాద్, మార్చి 31 (తీన్మార్ న్యూస్):

నగరంలోని అమీర్‌పేట్‌లో ఉన్న హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయానికి మంగళవారం బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ఈ–మెయిల్ ద్వారా ఈ బెదిరింపులకు పాల్పడటంతో అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం హెచ్ఎండీఏ కార్యాలయ అధికారిక మెయిల్ ఐడీకి ఆఫీసులో పలుచోట్ల బాంబులు ఉన్నట్లుగా మెసేజ్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో స్పాట్‌కు చేరుకుని భవనంలోని అన్ని అంతస్తులను, పార్కింగ్ ఏరియాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా కార్యాలయంలోని సిబ్బందిని, పనుల కోసం వచ్చిన సందర్శకులను పోలీసులు బయటకు పంపేశారు. భవనం చుట్టుపక్కల భారీగా పోలీసులను మోహరించారు. ప్రస్తుతం కార్యాలయంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇది ఆకతాయిల పనా లేక మరేదైనా కుట్ర కోణం ఉందా అని పోలీసులు విచారణ జరుపుతున్నారు. అసలు ఈ–మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది. దాని ఐపీ అడ్రస్ ఏంటి? అనే వివరాలను సైబర్ క్రైమ్ పోలీసులు సేకరిస్తున్నారు.

## పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

**ఏప్రిల్ 4న విచారణకు హాజరుకు ఆదేశం**

**ప్రభుత్వం కావాలనే వేధిస్తోంది**

**సీఐడీ నోటీసులపై కౌశిక్ రెడ్డి ఫైర్**




హైదరాబాద్, మార్చి 31 (తీన్మార్ న్యూస్):

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు ఇచ్చింది. కౌశిక్ రెడ్డితో పాటు మరో 20 మందికి సీఐడీ అధికారులు నోటీసులు అందజేశారు. ఏప్రిల్ 4న హైదరాబాద్‌లో విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. జనవరి 29న సమ్మక్క – సారలమ్మ జాతర సందర్భంగా హుజురాబాద్‌లో కౌశిక్ రెడ్డి హంగామా చేసిన విషయం తెలిసిందే. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హుజురాబాద్‌లో నమోదైన కేసును ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేసింది. ఈ కేసుపై సీఐడీ అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు నోటీసులు ఇచ్చిన సీఐడీ. ఏప్రిల్ 4న హైదరాబాద్ లక్డీకాపూల్‌లో ఉన్న సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సిందిగా స్పష్టంగా పేర్కొంది. సమ్మక్క–సాలరమ్మ జాతర సందర్భంగా కౌశిక్ రెడ్డితో పాటు ఆయన అనుచరులు కూడా ఆందోళన చేశారు. దీంతో వారందరినీ హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి నోటీసులు ఇచ్చారు సీఐడీ అధికారులు. దాదాపు 20 మందికి నోటీసులు అందజేశారు. సీఐడీ నోటీసులపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వేధిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే సీఐడీ నోటీసులు జారీ చేసిందని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

తీన్మార్
తెలుగు దిన పత్రిక

# ఆర్‌బిఐ అప్రతిహత జైత్రయాత్ర

భారతదేశ ఆర్థిక చరిత్రను నిశితంగా పరిశీలిస్తే, ఒక దేశం యొక్క సార్వభౌమాధికారం కేవలం దాని రాజకీయ సరిహద్దుల్లోనే కాకుండా, ఆ దేశ కరెన్సీ స్థిరత్వం మరియు ఆర్థిక క్రమశిక్షణలోనూ దాగి ఉంటుందని స్పష్టమవుతుంది. ఈ దిశగా భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, దిక్సూచిగా నిలిచిన అత్యున్నత సంస్థ 'భారతీయ రిజర్వు బ్యాంకు' (ఆర్బీఐ). ఒక చారిత్రక అనివార్యతగా ప్రారంభమై, నేడు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రీయ బ్యాంకులలో ఒకటిగా ఎదిగిన ఆర్బీఐ ప్రస్థానం అనన్య సామాన్యం. మొదటి ప్రపంచ యుద్ధం (1914- 1918) సృష్టించిన ఆర్థిక విధ్వంసం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల ఆర్థిక పునాదులను కదిలించి వేసింది. యుద్ధం కారణంగా ఏర్పడిన సరఫరా గొలుసు అంతరాయాలు, విపరీతమైన రక్షణ వ్యయం, మరియు కరెన్సీ విలువలలో సంభవించిన అస్థిరత అప్పట్లో బ్రిటిష్ వలస పాలనలో ఉన్న భారతదేశంపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. యుద్ధ కాలంలో బ్రిటన్ తన అవసరాల కోసం విపరీతంగా కరెన్సీని ముద్రించడంతో ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకింది. 1920వ దశకంలో భారతీయ రూపాయి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో, ముఖ్యంగా పౌండ్ స్టెర్లింగ్‌తో పోల్చినప్పుడు తీవ్రమైన ఒడిదుడుకులకు లోనైంది. రూపాయి విలువ ఒక పౌండ్ స్టెర్లింగ్‌కు 15 రూపాయల వరకు పెరగడం, మళ్ళీ అతి తక్కువ కాలంలోనే 13 రూపాయలకు పడిపోవడం వంటి పరిణామాలు భారతీయ వ్యాపారవేత్తలను, సామాన్య రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బ తీశాయి. కరెన్సీ మరియు పరపతి నియంత్రణను కేవలం ప్రభుత్వ విభాగంగా కాకుండా ఒక స్వతంత్ర కేంద్రీయ సంస్థ ద్వారా నిర్వహించాల్సిన అవసరం ఆ కాలంలోనే బలంగా వినిపించింది. ఈ నేపథ్యంలో, భారత కరెన్సీ మరియు ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు సూచించేందుకు 1926లో బ్రిటిష్ ప్రభుత్వం 'రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్'ను నియమించింది. దీనినే మనం 'హిల్టన్ యంగ్ కమిషన్' అని పిలుస్తాము. అయితే, ఈ బ్యాంకు ఏర్పాటు వెనుక ఉన్న మేధోపరమైన పునాదిని ప్రస్తావించకుండా ఆర్బీఐ చరిత్ర అసంపూర్ణ మవుతుంది. ఆధునిక భారతదేశ నిర్మాతలలో ఒకరైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాసిన "ది ప్రాబ్లం ఆఫ్ ది రూపాయి - ఇట్స్ ఆరిజిన్ అండ్ ఇట్స్ సొల్యూషన్" అనే పరిశోధనా గ్రంథం ఈ కమిషన్ ముందు ఒక దిక్సూచిలా నిలిచింది. అంబేద్కర్ గారు కరెన్సీ స్థిరత్వంపై అందించిన లోతైన విశ్లేషణలు, ఒక కేంద్రీయ బ్యాంకుకు ఉండాల్సిన స్వయం ప్రతిపత్తిపై ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు హిల్టన్ యంగ్ కమిషన్ సభ్యులను ఎంతగానో ప్రభావితం చేశాయి. ఫలితంగా, భారతదేశానికి ఒక స్వతంత్ర కేంద్రీయ బ్యాంకు ఉండాలనే బలమైన సిఫారసు వెలువడింది. ఈ సిఫారసుల ఆధారంగానే 'భారతీయ రిజర్వు బ్యాంకు చట్టం, 1934' ఆమోదించ బడింది. ఆ చట్టం ప్రకారం 1935 ఏప్రిల్ 1న ఆర్బీఐ తన కార్యకలాపాలను అధికారికంగా ప్రారంభించింది. ఆరంభంలో ఇది ఒక ప్రైవేట్ షేర్ హోల్డర్ల సంస్థగా, 5 కోట్ల రూపాయల ప్రాథమిక మూలధనంతో ఏర్పాటైంది. ఆ రోజుల్లో ఇది ఒక అసాధారణ పెట్టుబడిగా పరిగణించ బడేది. మొదట కోల్‌కతాలో ఉన్న దీని ప్రధాన కార్యాలయాన్ని, దేశ వాణిజ్య కార్యకలాపాల కేంద్ర బిందువుగా ఎదుగుతున్న ముంబైకి 1937లో మార్చడం జరిగింది. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత, దేశాభివృద్ధిలో కేంద్రీయ బ్యాంకు పాత్ర మరింత కీలకమని ప్రభుత్వం గుర్తించింది. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న ఆర్థిక అధికారం ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగపడాలనే ఉద్దేశంతో 1949 జనవరి 1న ఆర్బీఐని జాతీయీకరించారు. దీంతో ఇది పూర్తిగా భారత ప్రభుత్వ పర్యవేక్షణలోకి రావడమే కాకుండా, దేశ సామాజిక-ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే ఒక ప్రజాస్వామ్య సంస్థగా రూపాంతరం చెందింది. ఆర్బీఐ యొక్క ప్రాథమిక మరియు అత్యంత ముఖ్యమైన విధి 'కరెన్సీ జారీ'. ఒక రూపాయి నోటు మరియు చిల్లర నాణేలు మినహా, భారతదేశంలో చలామణిలో ఉన్న ప్రతి కరెన్సీ నోటు వెనుక ఆర్బీఐ గవర్నర్ సంతకం చేసిన 'భరోసా' ఉంటుంది. 1950వ దశకంలో కేవలం 1,200 కోట్లుగా ఉన్న కరెన్సీ చలామణి, నేడు 35 లక్షల కోట్లకు పైగా పెరగడం అనేది కేవలం అంకెల్లో పెరుగుదల మాత్రమే కాదు, అది భారత ఆర్థిక వ్యవస్థ విస్తరణకు, పారిశ్రామిక వృద్ధికి మరియు ప్రజల కొనుగోలు శక్తికి అద్దం పడుతోంది. అయితే, కేవలం డబ్బును ముద్రించడం మాత్రమే కాకుండా, మార్కెట్‌లో డబ్బు సరఫరాను నియంత్రించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం ఆర్బీఐ యొక్క అసలైన నైపుణ్యం. దీనినే మనం 'ద్రవ్య విధానం' అంటాము. రెపో రేటు (బ్యాంకులకు ఆర్బీఐ ఇచ్చే అప్పుపై వడ్డీ), రివర్స్ రెపో రేటు, నగదు నిల్వల నిష్పత్తి వంటి సంక్లిష్టమైన సాధనాల ద్వారా మార్కెట్‌లో నగదు లభ్యతను ఆర్బీఐ సర్దుబాటు చేస్తుంది. ఉదాహరణకు, కరోనా మహమ్మారి సమయంలో ఆర్థిక వ్యవస్థ స్తంభించకుండా ఉండేందుకు రెపో రేటును 4 శాతానికి తగ్గించి, మార్కెట్లోకి నిధులు ప్రవహించేలా చేయడం ద్వారా సామాన్యులకు తక్కువ వడ్డీకే రుణాలు అందేలా చేసిన ఘనత ఆర్బీఐదే. కేంద్రీయ బ్యాంకుగా ఆర్బీఐ పోషిస్తున్న మరో కీలక పాత్ర 'బ్యాంకర్లకు బ్యాంకర్'గా వ్యవహరించడం. దేశంలోని వాణిజ్య బ్యాంకులన్నీ తమ నిధులలో కొంత భాగాన్ని భద్రత కోసం ఆర్బీఐ వద్ద ఉంచాలి. ఇది బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని కలిగిస్తుంది. అలాగే, ప్రభుత్వానికి కూడా ఇది ఆర్థిక సలహాదారుగా పనిచేస్తుంది. ప్రభుత్వం తరపున బాండ్లు జారీ చేయడం, రుణాలు సేకరించడం వంటి బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తోంది. భారత ఆర్థిక చరిత్రలో 1991వ సంవత్సరం ఒక పెద్ద మలుపు. అప్పట్లో దేశం తీవ్రమైన విదేశీ మారక ద్రవ్య సంక్షోభాన్ని ఎదుర్కొంది. మన వద్ద ఉన్న నిల్వలు కేవలం రెండు వారాల దిగుమతులకు సరిపడేలా, అంటే కేవలం 1 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అటువంటి క్లిష్ట సమయంలో ఆర్బీఐ మరియు ప్రభుత్వం కలిసి చేపట్టిన సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలు మనల్ని గట్టెక్కించాయి. ఆ సంక్షోభం నుండి పాఠాలు నేర్చుకున్న ఫలితంగా, నేడు మన విదేశీ మారక నిల్వలు 650 బిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించాయి. ఇది ప్రపంచ వేదికపై భారత ఆర్థిక పటిమను చాటి చెబుతోంది. మారుతున్న కాలంతో పాటు ఆర్బీఐ తనను తాను ఆధునీకరించుకుంటూ వస్తోంది. నేడు మనం ఉపయోగిస్తున్న యూపీఐ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక పారదర్శకతను పెంచడంలో ఆర్బీఐ కీలక పాత్ర పోషించింది. 2024-25 నాటికి నెలకు సగటున 12 బిలియన్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయంటే, అది ఆర్బీఐ కల్పించిన డిజిటల్ మౌలిక సదుపాయాల విజయం. అంతేకాకుండా, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 'సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ' లేదా డిజిటల్ రూపాయిని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. ఇది కరెన్సీ నిర్వహణ వ్యయాన్ని తగ్గించడమే కాకుండా, లావాదేవీల వేగాన్ని పెంచుతుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరియు ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ఆర్బీఐ తన సమతుల్య విధానాలతో దేశాన్ని సురక్షిత తీరాలకు చేరుస్తోంది. 2022-2024 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు, ఆర్బీఐ అప్రమత్తంగా వ్యవహరించి వడ్డీ రేట్లను సవరించడం ద్వారా దేశీయ మార్కెట్‌లో ధరల స్థిరత్వాన్ని కాపాడింది. ముగింపుగా చెప్పాలంటే, భారతీయ

# వారికి మానవ హక్కులు లేవా?

ఆటిజం అనేది జీవితాంతం ఉండే ఒక నాడీ సంబంధిత రుగ్మత. పిల్లల్లో మొదటి మూడేళ్ల లోపు ఆటిజం సంభవిస్తుంది. ఈ సమస్యతో బాధపడుతున్న పిల్లలు ఎదుర్కొనే సమస్యలను అర్థం చేసుకోవడం చాలా క్లిష్టమైన అంశం. సామాజిక భద్రతతో పాటు పిల్లలకు భద్రత, గౌరవం, సమాన అవకాశాలను కల్పించడం తల్లిదండ్రులకు చాలా కష్టంతో కూడుకున్న విషయం. ఆటిజంను 'ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్' అని పిలుస్తారు. మొదటగా పిల్లలు సాధారణంగానే కనిపిస్తున్నప్పటికీ క్రమేణా సామాజిక, భాషా నైపుణ్యాలను కోల్పోవడం వలన ఈ వ్యాధి లక్షణాలు తీవ్రంగా మారతాయి. 18 నెలల వయస్సు ఉన్నప్పుడు పిల్లల్లో కనిపిస్తున్న లోపాలను గుర్తించడం జరుగుతుంది. ఆటిజం వేగంగా విస్తరిస్తుంది. ఆటిజం కలిగిన పిల్లల సామర్థ్యాలు, అవసరాలు మారుతూ కాలక్రమేణా పెరుగుతాయి. ఈ రుగ్మత కలిగిన వారిలో కొద్దిమంది స్వతంత్రంగా జీవించగలు గుతున్నప్పటికీ మరి కొంతమంది తీవ్రమైన వైకల్యానికి గురవుతారు. ఆటిజం చదువుతోపాటు ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపుతుంది. పర్యావరణంలో వస్తున్న మార్పులు ఆటిజం కలిగిన చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపుతున్నా యని అనేక అధ్యయన నివేదికలు వెల్లడిస్తున్నాయి. తల్లిదండ్రులు తక్కువ వయస్సు కలిగి ఉండడం, గర్భధారణ సమయంలో వాయు కాలుష్యానికి గురికావడం, నెలలు నిండక ముందే పిల్లలు పుట్టడం, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం వంటివి ఆటిజం పెరుగుదలకు కారణమవుతున్నా యి. ప్రపంచ జనాభాలో 1 శాతం మందికి ఆటిజం రుగ్మత ఉంది. 2023లో యునైటెడ్ స్టేట్స్ లోని ప్రతి 36 మంది పిల్లల్లో 1 శాతం మంది ఆటిజంతో బాధపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 2000 సంవత్సరం నుండి 2023 నాటికి 178 శాతానికి పెరిగింది. గత పదేళ్ల కాలంలో 7,07,000 నుండి 1,11,6000 మందికి పాఠశాలల్లో ఆటిజం రుగ్మతకు అవసరమైన సేవలు లభించడం లేదు. ఆటిజం కలిగిన పెద్దల్లో 75 శాతం మందికి ఉపాధి లభించడం లేదు. 25 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుల్లో 50 శాతం మంది ఉద్యోగం చేయలేకపోతున్నారు. ఆటిజం కలిగిన వారిలో 40 శాతం మంది శబ్దం వినలేక పోతున్నారు. 78 శాతం మంది పిల్లలు మరొక మానసిక ఆరోగ్య రుగ్మత కలిగి ఉంటున్నారు. 80 శాతం మంది ఆటిజం కలిగిన పిల్లలు నడవలేకపోతు న్నారు. రాయలేకపోతున్నారు. మన దేశంలో ప్రస్తుతం 1 కోటి 80 లక్షల మంది ఆటిజంతో బాధపడుతున్నారని అంచనా. దేశంలో ప్రతి 66 మంది పిల్లలలో ఒకరికి ఆటిజం సమస్య ఉంది. ఆటిజం సమస్య కలిగిన పిల్లల్లో 40 శాతం మంది పిల్లలు మాట్లాడలేకపోతున్నారు. ఆటిజం అమ్మాయిల కంటే అబ్బాయిల్లో 4 రెట్లు ఎక్కువగా నిర్ధారణ అవుతున్నదని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఆటిజం ఉన్న పెద్దల్లో 40 శాతం మంది జీతం పొందే ఉద్యోగాలు చేయలేకపోతున్నారు. ఈ సమస్య వున్న వారిలో మూడింట ఒక వంతు మందికి ఆందోళన ఉంటుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ఆటిజంను కూడా అంగవైకల్యంగా గుర్తించింది. కానీ నేటికీ వారికి వైకల్య ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. ఆటిజం, సెరిబ్రల్ పాల్సి, మానసిక వికలాంగుల సంక్షేమం కోసం నేషనల్ ట్రస్ట్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. ఈ రుగ్మత కలిగిన వారికి ప్రత్యేక పాఠశాలలు, సౌకర్యాలు కల్పించాలి. ఆటిజం సమస్య కలిగిన పిల్లలకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలి. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలి. పుట్టిన పిల్లల్లో శారీరక, మానసిక వైకల్యాల లోపాలను గుర్తించి వాటిని నివారించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉంది. ఆటిజం ఉన్న వారితో సహా ప్రజలందరికీ అత్యున్నత స్థాయి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందే హక్కు ఉంది. అయినప్పటికీ, ఆటిజం ఉన్న వారు తరచుగా వివక్షకు గురవుతారు. మరీ ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, విద్యకు సంబంధించి సమాన అవకాశాలను అన్యాయంగా నిరాకరించడం జరుగుతున్నది. ఆటిజం ఉన్నవారికి సాధారణ జనాభాకు ఉండే ఆరోగ్య సమస్యలే ఉంటాయి. అయితే, వీరికి అదనంగా, ఇతర ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ అవసరాలు ఉండవచ్చు. సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వంటి ప్రవర్తనాపరమైన కారణాల వల్ల, వారు దీర్ఘకాలిక అంటువ్యాధులు, వ్యాధుల బారిన పడటానికి అవకాశం ఎక్కువ. అలాగే వారు హింసకు గురయ్యే, గాయాలపాలయ్యే ప్రమాదం కూడా ఎక్కువ. ఆటిజం ఉన్నవారు అకాల మరణం చెందే అవకాశం అధికం. సాధారణ జనాభాతో పోలిస్తే ఆటిజం ఉన్నవారిలో ఆరోగ్య సంరక్షణ అవసరాల రేటు ఎక్కువగా ఉంది. మానవతా అత్యవసర పరిస్థితులలో కూడా వారు ఎక్కువగా ప్రభావితమ వుతారు. ఆరోగ్య సంరక్షణ చూసేవారికి ఆటిజం గురించి సరైన అవగాహన లేకపోవడం ఒక సాధారణ అడ్డంకిగా ఏర్పడుతున్నది. ఆటిజంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసి తల్లిదండ్రులలో, సమాజంలో దీనిపట్ల అవగాహన కల్పించేందుకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

# ఆధునిక శరీర ధర్మశాస్త్ర పితామహుడు విలియం హార్వే

శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతి గురించి చాలా కాలం క్రితమే పరిశోధించి, భావి వైద్యులకు అపూర్వ విజ్ఞానాన్ని అందించిన గొప్ప శాస్త్రవేత్త విలియం హార్వే. మనిషి గుండెకు సంబంధించిన పూర్తి వివరాలను మిగతా జంతువుల గుండెలతో పోల్చి చూసి శాస్త్ర బద్ధంగా అందజేసిన ఘనత విల్లియం హార్వేకు దక్కుతుంది. శరీరం ద్వారా రక్త ప్రసరణను కనుగొన్న మొదటి పరిశోధకుడు. శరీరంలో రక్త ప్రసరణను సరిగ్గా వివరించి, విలియం హార్వే, ధమనులు మరియు సిరలు పూర్తి సర్క్యూట్ ను ఏర్పరుస్తాయని చూపించాడు. సర్క్యూట్ గుండె వద్ద మొదలై గుండెకు తిరిగి వెళుతుందని అపూర్వ పరిశోధనల ఫలితాలను రుజువు పరిచాడు. మానవ శరీరంపై ఆసక్తి పెంచుకున్న హార్వే అనేక జంతువుల శరీర అంతర్భాగాలను క్షుణ్ణంగా పరిశీలించి గుండెకు, రక్త ప్రసరణ వ్యవస్థ కు సంబంధించి లోతుగా అధ్యయనం చేసిన క్రమంలో గుండె పనితీరు, రక్త ప్రసరణ విధానాలను గమనించాడు. నాడి కొట్టుకోవడం అంటే గుండె కొట్టు కోవడమే అని రుజువు చేశాడు. మనిషి గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టు కుంటుందో, ఎంత రక్తాన్ని పంప్ చేస్తుందో చెప్పగలిగాడు. తన పరిశీలనలతో రెండు అమూల్యమైన గ్రంథాలను వెలువరించాడు. విలియం హార్వే (ఏప్రిల్ 1, 1578 - జూన్ 3, 1657) ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వైద్యశాస్త్రవేత్త. గుండె పనిచేసే తీరును, శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతిని చాలా క్రితమే వివరించి నేటి వైద్యులకు మార్గదర్శకు డయ్యాడు. నేడు హృదయం గురించి అందరికీ తెలుసు. రక్త ప్రసరణ వ్యవస్థ మొత్తం ఎలా నడుస్తుందో చెప్పగలుగు తున్నారు. అదే 16 వ శతాబ్దం వరకు గుండె గురించి దేవునికి తప్ప మానవ మాత్రులకు ఏమీ తెలియదు అని భావించేవారు. విలియం హార్వే ఇంగ్లండులోని ఫోక్‌స్టోన్‌లో 1578 ఏప్రిల్ 1న సంపన్నుడైన పట్టణ మేయరుకు పదిమంది సంతానంలో ఒకడిగా పుట్టాడు. పదిహేనవ యేట కేంబ్రిడ్జిలోని సైన్స్ కాలేజీలో చేరాడు. పట్టభద్రుడయ్యాడు. ఆపై వైద్య విద్య కోసం ఇటలీలోని పాడువా వైద్య విద్యాలయంలో చేరాడు. అక్కడ హరోనిమస్ ఫాబ్రిసియస్ అనే ప్రముఖ వైద్య శాస్త్రజ్ఞుని వద్ద శిష్యరికం చేశాడు. 1602 లో వైద్య శాస్త్రంలో పట్టా పుచ్చు కొనటమే



కాకుండా ప్రత్యేకమైన యోగ్యతా పత్రాన్ని పొంద గలిగాడు. అక్కడి నుంచి లండన్ తిరిగి వచ్చాక ఇంగ్లండ్ రాజు మొదటి ఛార్లెస్ కొలువులో ఆస్థాన వైద్యుడిగా నియమితు డయ్యాడు. అంతటి హోదాలో ఉన్న సంపన్నులు ఎవరైనా విలాసంగా జీవితం గడిపేస్తారేమో కానీ, విలియం హార్వే మాత్రం కొత్త విషయాలు తెలుసు కోడానికి పరిశోధకుడిగా మారాడు. గుండెకు సంబంధించిన సందేహాలు మాత్రం ఆయనను వదలలేదు. గుండె నుండి బయలు దేరిన రక్తం రక్త నాళాలలో అటూ ఇటూ ప్రవహించి చివరికి హరించుకు పోతుందే తప్ప మళ్లీ గుండెను చేరదు అనే వాదంలో నిజం ఉన్నట్లు హార్వేకు తోచలేదు. పెద్ద పెద్ద సిరలలో కవాటాలు ఎందుకు ఉంటాయనే తపన కూడా ఆయనలో బయలుదేరింది. 1615 లో రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ లో ఆయన లెక్చరర్ గా నియమింప బడ్డాడు. చేపలు, కప్పలు, కోళ్ళ పిండాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ వాటి రక్త ప్రసరణ గురించి ఎంతో క్షుణ్ణంగా అధ్యయనం చేయ సాగాడు. గుండె ముడుచు కోవటం వల్ల రక్తం ధమనుల ద్వారా రక్త నాళాలకు వెళు తుందని తెలుసు కున్నాడు. నాడి కొట్టుకోవడం అంటే గుండె కొట్టు కోవడమే అని రుజువు చేశాడు. గుండెలో నాలుగు గదులు ఉంటాయని, ధమనుల ద్వారా గుండె లోని రక్తం బయటికి పంప్ చేయ బడుతుందని, సిరల ద్వారా కవాటాలు రక్తాన్ని గుండె వైపుకి వెళ్ళనిస్తాయే కాని గుండె లోంచి రక్తాన్ని వెలుపలికి రానివ్వవని తెలుసు కున్నాడు. ఒక అర గంటలో శరీరంలో ఉన్న మొత్తం రక్తం గుండె నుండి వెలువడే రక్తమే ఎక్కువగా ఉంటుందని నాడీ వేగం, గుండె స్పందించే రేటు ఆధారంగా నిర్ధారించుకో గలిగాడు.

చనిపోయిన ఖైదీల శరీరాలను అడుగడుగునా పరిశీలించడం ద్వారా గుండె ఒక పంపులాగా పనిచేస్తుందని, శరీరంలో సిరలు, ధమనుల ద్వారా రక్తం వలయా కారంలో ప్రవహిస్తుందని తెలుసు కున్నాడు. రక్తం ప్రవహించే మార్గంలో వాల్వులు ఎలా పనిచేస్తాయో కనిపెట్టాడు. మనిషి గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకుంటుందో, ఎంత రక్తాన్ని పంప్ చేస్తుందో చెప్ప గలిగాడు. తన పరిశీలనలతో రెండు అమూల్యమైన గ్రంథాలను వెలువరించాడు. 1628 లో, 50 సంవత్సరాల వయస్సులో, హార్వే తన పరిశోధనా ఫలితాలను ప్రచురించాడు - సాధారణంగా దీనిని డి మోటో కార్డిస్ - ది మోషన్ ఆఫ్ ది హార్ట్ అని పిలుస్తారు. ఆంగ్లంలో అనాటమికల్ స్టడీస్ ఆన్ ది మోషన్ ఆఫ్ ది హార్ట్ అండ్ బ్లడ్ ఇన్ యానిమల్స్ అంటారు. ఈ ప్రచురణ వైద్య శాస్త్ర చరిత్రలో అపూర్వమైనది. పరిశోధనల ద్వారా వచ్చిన ఫలితాలను మళ్ళీ పరిశోధనల ద్వారానే రూఢి పరచాలనే శాస్త్రవాది హార్వే. ఈ పుస్తకం ప్రచురించిన మూడు సంవత్సరాల తరువాత హార్వే మొదటి చార్లెస్ మహారాజుకు రాజ వైద్యునిగా నియమించ బడ్డాడు. కానీ రాజకీయ విపరిణామాల కారణంగా హార్వే లండన్ విడిచి పెట్టవలసి వచ్చింది. అప్పుడే కొంతమంది దుండగులు హార్వే ఇంటిలో లేని సమయం చూచి ఆయన నాలుగు దశాబ్దాలుగా సేకరించిన దాచుకున్న అమూల్యమైన విజ్ఞాన సంపద నంతా నాశనం చేశారు. అయినా హార్వే బాధ పడలేదు. నిరాశతో క్రుంగిపోలేదు. ప్రత్యుత్పత్తి, పిండాభివృద్ధి అంశాల మీద జీవితమంతా పరిశోధించాడు. 1651 లో "ఎక్సర్ సైజస్ ఆన్ ది జనరేషన్ ఆఫ్ ఆనిమల్స్" అనే పుస్తకాన్ని ప్రచురించాడు. ఈ పుస్తకం ప్రతులు అతి త్వరిత గతిలో అమ్ముడైపోయి కొత్త చరిత్రను సృష్టించాయి. హార్వే 1657 సంవత్సరం జూన్ 3 న మరణించాడు.

# వంట గ్యాస్ సిలిండర్ల కొరత తీరేనా?

మారుమూల పల్లెల నుండి మొదలుకొని పేరు మోసిన పట్టణాల్లో సైతం గ్యాస్ సిలిండర్ల వాడకం విరివిరిగా కొనసాగుతుంది. కానీ ఇప్పుడున్న విపత్కర పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల వాడకదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గ్యాస్ వినియోదారుల అవస్థలు అంత పట్టకుండా ఉండే పరిస్థితులు నేడు దాపరించాయి. ప్రస్తుతం ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో యుద్ధాలు జరుగుతుండడమే వంటగ్యాస్ కొరతకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఈ యుద్ధాల వల్ల గ్యాస్ ఉత్పత్తుల్లో, అంతర్జాతీయ సరఫరా ప్రభావితం అవుతుంది. రష్యా , ఉక్రెయిన్, ఇజ్రాయెల్ వంటి దేశాల నుండి ఖఉ, నాచురల్ గ్యాస్, కొద్దిపాటి పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా క్రమంగా తగ్గిపోతుంది. దీనివల్ల విదేశీ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సరఫరా తగ్గుముఖం పట్టడం వల్ల గ్యాస్ సిలిండర్ డిమాండ్‌పై తీవ్రమైన ఒత్తిడి పెరుగు తుంది. భారతదేశంలో ఒఖఉ గ్యాస్ దిగుమతి ఆధారిత వనరుగా ఉంది. తద్వారా కొన్ని దేశాల నుండి ఒఖఉ గ్యాస్ సరఫరా నిలిచిపోయే ఆస్కారం ఉంది. దీనివల్ల ఒఖఉ గ్యాస్ కొరత గణనీయంగా పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం సామాన్య కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజానీకం గ్యాస్ సిలిండర్ల సరఫరా పూర్తిస్థాయిలో లేక సతమతమవుతున్నారు.



వృద్ధులు, నిరాక్షరాస్యులు ఎలా గ్యాస్ బుక్ చేసుకోవడం తెలియని పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. స్థానిక ఒఖఉ డీలర్ల వద్ద నిల్వలు తగ్గడం వల్ల ఫోన్ లేదా ఆన్లైన్ బుకింగ్ ద్వారా గ్యాస్ సిలిండర్లు అందుబాటులోకి రావడం చాలా కష్టంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో కనీసం బుక్ కావడం కూడా ఒక సవాలుగా దాపరించింది. టోల్ ఫ్రీ నెంబర్, ఐవిఆర్ఎస్, యాప్, ఇలా ఎన్నో రకాలుగా ఉన్న ప్రత్యామ్నా యాల ద్వారా కూడా ప్రయత్నం చేసినా బుక్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో కొరత అధికంగా ఉంది అనడంలో ఆశ్చర్యం లేదు. ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో చాలామంది ప్రజలు మళ్ళీ పూర్వ కాలపు విధానాల ఏర్పాట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. వంట చెరుకు, గోబర్ గ్యాస్, విద్యుత్ వాడకపు సాధనాలను వినియోగిస్తూ వంట చేసుకుంటున్నారు. భవిష్యత్తులో ఒఖఉ మార్కెట్‌పై అనూహ్య ప్రభావాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా ఇలానే యుద్ధం కొనసాగితే ధరలు అనియంత్రితంగా పెరిగే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో డీలర్ల వద్ద స్టాక్ తక్కువ ఉండడం వలన గ్యాస్ సిలిండర్ల ధర విషయంలో చేతివాటం చూపిస్తున్నారు. వాణిజ్య కేంద్రాలైన హోటల్, రెస్టారెంట్లు, హాస్టల్స్ యాజమాన్యాలతో కుమ్మక్కై గ్యాస్ సిలిండర్లను వారికి నచ్చిన ధరలతో సరఫరా చేస్తూ గృహ వినియోగదారులకు మొండి చేయి చూపిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు చాలా చోట్ల జరుగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇలాంటి విషయాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాలను పర్యవేక్షిస్తూ స్టాక్ రికార్డులను పరిశీలించాలి. డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాల వద్ద సామాన్య ప్రజలు తమ పనులను వదులుకొని గంటల తరబడి వేచి ఉండి ప్రాధేయపడిన వారికి సరైన సమాధానం చెప్పే నాధుడు కరువయ్యాడు. ప్రభుత్వ అధికారులు వినియోగదారుల పరిస్థితులను వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని కార్యాచరణ చేయాల్సిన అవసరం ఉంది. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు నెంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

# భట్టి "పద్దులో మౌలిక" మార్పు ఏది..?

# కొత్త సీసాలో పాత సారా..!

"మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి" అనే నినాదంతో పదేండ్ల విధ్వంసకర పాలన నుంచి తెలంగాణకు విముక్తి హస్తం పార్టీతో సాధ్యమని నాడు కాంగ్రెస్ లీడర్లు బలమైన ప్రచారం చేశారు. జనం సైతం "చేతి" లో చేయి వేసి కాంగి "రేసు" ను ముందు వరుసలో ఎన్నికల రణరంగంలో నిలిపి రేవంత్ నాయకత్వంలోని మూడు రంగుల జెండాకు మద్దతు తెలిపారు. 2023 డిసెంబరులో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చారు. ప్రజాప్రభుత్వంలో తమకు కావాలిసిన మార్పు వ్యవస్థలో, విధానాల్లో సాధ్యమయి మంచి చేస్తాడనే ప్రజల ఆశలు అడియాసలుగానే ఉంటున్నాయి. ప్రజాప్రభుత్వమని పేర్కొనే బడ్జెట్‌లో 27 నెలల పాలనలో మౌలికమైన మార్పు కనపిస్తలేదు. గత సర్కారు మాదిరిగానే "బంగారు తెలంగాణ" ను చేస్తామంటూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ.. "కొత్త సీసాలో పాత సారా" అన్నట్లుగానే ఆచరణలో ప్రభుత్వ తీరు ఉన్నది. పద్దు రూపలకల్పనలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు ప్రతిబింబించడం లేదు. కనీసం జనబాహుళ్యం భాగస్వామ్యం ఉండేలా పద్దు రూపకల్పన చేయడం లేదు. కేవలం అధికారులతో మాత్రమే కూర్చొని నామమాత్రంగా బడ్జెట్ లెక్కల పెంపు జరిగినట్లు స్పష్టమౌతున్నది. ఆర్థిక మంత్రి పద్దు లెక్కల డొక్కలలోకి వెళ్లడం, అంకెల గారడీ చేయడమే తప్ప మౌలికంగా జనం, నిపుణుల భాగస్వామ్యానికి చోటు కల్పించేలా చొరవ కనీసంగా అయినా కనిపించడం లేదు.

**నాటి మాటలు నీటి మూటలే..**

నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి మాటలు, నేడు ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యానాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. "ఆదాయం పెంచి ప్రజలకు పంచుతాం.. అప్పులు అడ్డగోలుగా చేయబోం" అని బీరాలకు పోయిన కాంగ్రెస్ నాయకుడు నేడు సభా నాయకుడిగా చట్ట సభల సాక్షిగా అప్పుల గురించి చెబుతున్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు గత ప్రభుత్వ పదేండ్ల కాలంలో గల్లంతు అయిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం కనీసంగా యువత ముఖ్యంగా నిరుద్యోగ యువతకు సంబంధించిన



పద్దులో కేటాయింపులు ఆచరణలో యువ "తెలంగాణం" పరిఢవిల్లేలా అంతగా ఆసక్తి చూపినట్టు కనిపించడం లేదు. గత పాలకుల మాదిరిగానే ఆదాయ అన్వేషణ మార్గాలను మాత్రం అన్వేషిస్తూ.. ఎక్సయిజ్ ద్వారా డబ్బు వస్తుందనే సూత్రీకరణనే కొనసాగిస్తున్నారు. ప్రస్తుత యుద్ధ ప్రభావం నేపథ్యంలో చమురు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ యువతపై ఏఐ ప్రభావం వంటి నిజమైన చర్చనీయాంశాలను సైతం కనీసంగా పద్దు ప్రతిపాదనల సందర్భంలో ఎక్కడా వెల్లడించలేదు. ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420



లింగబత్తిని కృష్ణ
జర్నలిస్ట్
సెల్:9701923260

హామీల అమలుపైన ఏ మాత్రం వివరణ లేదు. మహిళలకు ఫ్రీ బస్ జర్నీ, ఆరోగ్యశ్రీలో లిమిట్ పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు మరికొన్ని తప్ప మిగతా కీలకమైన హామీలకు పద్దులో కేటాయింపుల్లేవు. మహిళలకు ప్రతీ నెలా రూ.2,500(మహాలక్ష్మి స్కీం కింద), విద్యార్థినులకు స్కూటీలు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారంతో పాటు బోలెడన్ని హామీలు నీటిమూటలేనా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్కారు పెద్దలకు వీటన్నింటి కంటే కూడా ఫక్తు రాజకీయంపైనే ఫుల్ ఫోకస్ చేస్తున్నారు. 24 గంటలు లాబీయింగ్.. ఢిల్లీ అధిష్టానానికి కంప్లయింట్స్, మంత్రుల వద్ద పైరవీలు, రాజకీయంపైనే సర్కారులోని కీలక వ్యక్తులు ప్రయారిటీ ఇస్తున్నట్లు ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నాయి."మార్పు" అనేది కేవలం అధికారంలోని పార్టీ మాత్రమేననే అభిప్రాయం జనబాహుళ్యం నుంచి వ్యక్తం అవుతున్నది. బడ్జెట్ ప్రతులలోని అక్షరాలు సైతం గత సర్కారు హయంలో మాదిరిగానే అవే పడికట్టు పదాలతో ఉండటం గమనార్హం. నిజంగా క్షేత్రస్థాయిలో ప్రజల స్థితిగతులు, యువత ముఖ్యంగా నిరుద్యోగులకు సంబంధించిన అంశాలు, పన్నెండేండ్ల తెలంగాణలో సాధించుకోలేకపోతున్న అంశాలపైన నిపుణులు, అన్ని రంగాలకు చెందిన ప్రముఖులతో ప్రభుత్వం చర్చలు జరిపి.. వాటన్నింటి సారాన్ని వడపోసి పద్దులో కేటాయింపులు చేసినప్పుడు ప్రజలకు సంబంధించిన పనులకు అడుగులు పడతాయి. అప్పుడు మాత్రమే ప్రజా ప్రభుత్వం అని ప్రస్తుత సర్కారు చెప్పుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఆ దిశగా ఇప్పటికైనా ప్రస్తుత రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఆలోచన చేయాలని ఆశిద్దాం.. కోరుదాం.. డిమాండ్ చేద్దాం..

## ప్రభుత్వ భూముల రక్షణ కోసం "గ్రామస్థులు పోరుబాట"

### అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ధ్వజం.. హద్దులు నిర్ణయించాలని డిమాండ్

### ఈ మేరకు తహసీల్దార్ కు వినతి అందించిన గ్రామస్థులు

### చిన్నకోడపాకలో వెలుగులోకి వచ్చిన ఉదంత్తం

కొత్తపల్లి గోరి, మార్చి 31 (తీన్మార్ న్యూస్):

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలంలో ప్రభుత్వ భూముల రక్షణ కోసం గ్రామస్థులు పోరుబాట పట్టారు. మండలంలోని చిన్నకోడపాక గ్రామంలో ఉన్న విలువైన ప్రభుత్వ భూములను కొందరు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ధ్వజం**

ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అక్రమంగా అప్పగిస్తున్నారన్న సమాచారంతో గ్రామ సర్పంచ్ సాధు సుమలత ధర్మేందర్, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు అప్రమత్తమయ్యారు. కమ్యూనిస్టు నేతలు, గ్రామ ప్రజలతో కలిసి వారు ఐక్యంగా కదిలారు. కబ్జాకు గురవుతున్న భూములను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి వెంటనే ప్రభుత్వమే హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

**ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేత**

అనంతరం బాధ్యులైన అధికారుల తీరును నిరసిస్తూ




సంబంధిత ఎమ్మార్వోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే స్వార్థ ప్రయోజనాల కోసం ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. వివాదాస్పద భూమిని వెంటనే ప్రభుత్వ పరం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గట్టు ప్రదీప్, బండారి రవీందర్, పొదిల కృష్ణ, కనకం రామన్, గుంటి చంద్రమౌళి, పైల్ల శాంతి, బొట్ల చక్రపాణి, రాజన్న, ప్రశాంత్ మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమ సేవల్లో పారదర్శకతను పెంచాలి

**జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**



వరంగల్ జిల్లా, మార్చి 31 (తీన్మార్ న్యూస్):

కార్మికుల సంక్షేమ సేవల్లో పారదర్శకతను మరింత బలోపేతం చేస్తామని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద తెలిపారు. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పనితీరుకు సంబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందిన ఫిర్యాదులపై సమీక్షించేందుకు, కార్మిక శాఖ అధికారులు మరియు గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కార్మికుల నమోదు (రిజిస్ట్రేషన్), క్లెయిమ్ దరఖాస్తుల సమర్పణ, పరిశీలన, ఆమోద ప్రక్రియలు పూర్తిగా పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రక్రియలో మధ్యవర్తులు జోక్యం పెరుగుతుండటంతో నిజమైన లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనివల్ల వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యవర్తుల ప్రమేయాన్ని పూర్తిగా అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. క్లెయిమ్‌ల ప్రాసెసింగ్‌లో ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా పారదర్శక విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, కార్మిక శాఖ అధికారులు మరియు గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, క్లెయిమ్‌ల పరిశీలన మరియు ఆమోద ప్రక్రియను పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికులు ఎటువంటి జోక్యం లేకుండా నేరుగా సంక్షేమ సేవలను పొందేలా వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలని, ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం, విశ్వసనీయత ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా, తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ అధికారులు, ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఉప సర్పంచ్ కాక రంజిత్



తాడ్వాయి, మార్చి 31 (తీన్మార్ న్యూస్):

మంగళవారం అనగా ఈరోజున తాడ్వాయి మండలం ఊరట్టం గ్రామ పంచాయతీ పరిధిలోని జంపంగవాయి ( కొత్తూరు ) గ్రామంలో రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క చొరవతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించిన ఊరట్టం గ్రామ ఉప సర్పంచ్ కాక రంజిత్, ఈ కార్యక్రమంలో సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చర్ప రవీందర్, తాడ్వాయి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గొంది సరిత, ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి గజ్జల ప్రసాద్, సీనియర్ నాయకులు చర్ప చంద్ర శేఖర్, తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గజ్జల రాజశేఖర్, గజ్జల సంపత్, గజ్జల రాజేందర్, జాలిగపు కుమార్, చిరంజీవి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## పదవి విరమణ చేసిన పోలీసు అధికారులకు వీడ్కోలు కార్యక్రమం

**సిద్దిపేట** : సిద్దిపేట్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘంగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు. సింగీతం శంకర్ రావు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, బెజ్జంకి పోలీస్ స్టేషన్ , ఉద్యోగ ప్రస్థానం కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ వరకు అంచలంచలుగా పదవోన్నతి పొంది పనిచేయడం జరిగింది. చాద శ్రీనివాస్ సిద్ధిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,ఉద్యోగ ప్రస్థానం కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ వరకు అంచలంచలుగా పదవోన్నతి పొంది పనిచేయడం జరిగింది. పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, అభినందించి, సన్మాన పత్రం మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖలో సుదీర్ఘంగా సర్వస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయడం జరుగుతుంది. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేశారు. సిద్దిపేట పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని, పదవీవిరమణ చేసిన మీరు పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన సిపి సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి ధాన్యం ప్రతి గింజ కొనుగోలు చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మార్చి 31 (తీన్మార్ న్యూస్):

యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలసి కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, తూనికలు– కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,87,309 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా ఉన్నదని, అందులో సన్న రకం 1,35,365 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 51,944 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 168 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అవసరాన్ని బట్టి అదనపు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యాన్ని ఏ, బి గ్రేడ్‌లుగా విభజించి మద్దతు ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2389, బి గ్రేడ్‌కు రూ. 2369 ధరలు నిర్ణయించగా, సన్న రకం వడ్లకు అదనంగా రూ. 500 బోనస్ ఇవ్వబడుతుందని వెల్లడించారు. ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు, హమాలీలు ఎండబారకుండా టెంట్లు, షెడ్ నెట్‌లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి తగిన నీడ కల్పించాలని సూచించారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ నియంత్రణ కోసం క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతులకు టోకెన్లు జారీ చేయాలని, అవసరమైన ఏర్పాట్లపై చెక్‌లిస్ట్ జారీ చేసి, దాని ప్రకారం చర్యలు తీసుకొని ధృవీకరణ నివేదికలు సమర్పించాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యం రాకుండా జిల్లాలో చెక్‌పోస్టుల ద్వారా పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు ఆన్‌లైన్ నమోదు చేసి రైస్ మిల్లులకు తరలించాలని, రవాణాలో జాప్యం జరగకుండా మిల్లర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ధాన్యం విక్రయాలపై రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే రైతులకు మెరుగైన ధర లభిస్తుందని, రైతులను సన్నద్ధం చేయాలని సూచించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సంబంధిత సెంటర్ ఇన్‌చార్జ్‌లు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ధాన్యం విక్రయానికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, బ్యాంక్ వివరాలు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ వెంట తీసుకురావాలని సూచించారు. ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా రిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలిపారు. గన్నీ సంచులు సరిపడా నిల్వలో ఉంచి, ఆన్‌లైన్ నమోదు చేసిన రైతులకు మాత్రమే ఇవ్వాలని, వాటి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్లు సిద్ధంగా ఉంచాలని, బ్యానర్ల ద్వారా మద్దతు ధరలు, నాణ్యతా ప్రమాణాలు, అధికారుల సంప్రదింపు వివరాలు స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. సన్న వడ్లు, దొడ్డు వడ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు




సమయంలో ఐరిస్ స్కానర్ ద్వారా మాత్రమే ప్రక్రియ పూర్తి అవుతుందని, డేటా ఎంట్రీ సమయంలో రైతు తప్పనిసరిగా హాజరుగా ఉండాలని తెలిపారు. తూకపు పరికరాలను తనిఖీ చేసి సీల్స్ వేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్ డి ఓ మధు,పౌర సరఫరాల సంస్థ మేనేజర్ త్రినాధ్ బాబు, పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, వ్యవసాయ అధికారి బాబురావు, తూనికలు–కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం చారిత్రక మైలురాయి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**అత్యధికంగా ప్రయాణాలు చేసిన మహిళలకు సత్కారం**




**వరంగల్ జిల్లా, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**
మహాలక్ష్మి పథకం రాష్ట్ర చరిత్రలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ప్రజాపాలన-- ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలవుతున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఈ నెల 29 నాటికి మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు జరిగి సుమారు రూ.10,000 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా అయిన సందర్భంగా వరంగల్ ఆర్టీసీ ఆధ్వర్యంలో వరంగల్ బస్ స్టేషన్ ఆవరణలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. సత్య శారదతో కలిసి మేయర్ హాజరైనారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, మార్చి నెల మహిళల అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణాల వల్ల మహిళలు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను సులభంగా అందిపుచ్చుకుని, తమ ఆర్థిక స్థితిని బలోపేతం చేసుకునే అవకాశం పొందుతున్నారని అన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలు పట్టణాలకు వచ్చి వ్యాపారాలు నిర్వహించడం, తమ ఉత్పత్తులను విక్రయించడం సులభమవుతోందని, దీని ద్వారా వారి ఆదాయం పెరుగుతోందని వివరించారు. అదేవిధంగా, టెక్స్టైల్ పార్క్‌లో కేటెక్స్, యంగ్ వన్ వంటి ప్రముఖ సంస్థలు పెట్టుబడులు పెట్టి ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నాయని, మహిళలకు అవసరమైన శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.10 వేల కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా కావడం ఒక విశేషమని అన్నారు. వరంగల్ జిల్లాలో సుమారు 6 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదై రూ.270 కోట్ల ఆదా సాధించామని తెలిపారు. ఈ పథకం పట్ల మహిళల్లో పెరుగుతున్న స్పందనను టికెట్ల వినియోగం స్పష్టంగా చూపుతోందని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో గీసుగొండ, సంగెం మండలాలకు ఒక్కో ఎలక్ట్రిక్ బస్సును కేటాయించి మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. అదనంగా రూ.200 కోట్ల వ్యయంతో ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఆధునిక ఛార్జింగ్ కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అనంతరం అత్యధికంగా బస్సు ప్రయాణాలు చేసిన వివిధ రంగాలకు చెందిన మహిళలను కలెక్టర్, మేయర్ లు శాలువాలతో సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, డీఆర్ఓ విజయలక్ష్మి,డీఆర్‌డీఓ రామ్ రెడ్డి, డిపో మేనేజర్ ధరం సింగ్, అసిస్టెంట్ మేనేజర్ నజియా సుల్తానా, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలన






**అంగన్వాడీ, సఖి కేంద్రాల ఆకస్మిక తనిఖీ**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**
మంగళవారం, జనగామ మండలంలోని అడవికేశ్వాపూర్ గ్రామ పరిధిలో గల ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం అమలు వంటి అంశాలను పర్యవేక్షించారు. అలాగే కలెక్టర్ విద్యార్థులతో స్వయంగా మాట్లాడి, వారి చదువు స్థాయి, పాఠ్యాంశాలపై అవగాహన గురించి పలు ప్రశ్నలు వేసి పరీక్షించారు. మధ్యాహ్న భోజనం అమలుపై మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? ఆహార నాణ్యత, వంట విధానం, వంటశాల, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, పాఠశాలల్లో అన్ని సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జనగామ మండలంలోని అడవికేశ్వాపూర్ గ్రామ పంచాయతీలో గల అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఎఈ నేపథ్యంలో కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. చిన్నారుల ఎత్తు, బరువు కొలతలను పరిశీలించి, వారి ఆరోగ్య స్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోషకాహారం సరైన విధంగా అందుతుందా.. మెనూ ప్రకారం వంటలు తయారు చేస్తున్నారా.. అనే విషయాలను కలెక్టర్ పర్యవేక్షించారు. అంగన్వాడీ కేంద్రంలో ఆహార పదార్థాల నాణ్యత, వండే విధానం, పరిశుభ్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో ముఖ్యమని, అంగన్వాడీ సిబ్బంది బాధ్యతగా పని చేసి పిల్లలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. తదనంతరం జిల్లా కేంద్రంలో గల సఖి కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో సఖి కేంద్రంలో బాధిత మహిళలకు అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. సేవలు సమయానికి, సమర్థవంతంగా అందుతున్నాయా.. సఖి కేంద్రానికి ఎలాంటి కేసులు వస్తున్నాయి.. వచ్చిన కేసులకు ఎలా కౌన్సిలింగ్ ఇస్తున్నారు.. అని సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకు న్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్క రించేందుకు సఖి కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మహిళలకు అందిస్తున్న కౌన్సెలింగ్, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మహిళలకు తక్షణ సహాయం అందించే విధంగా సిబ్బంది పని చేయాలని తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# మహిళలకు ఎంతో ప్రయోజనం మహాలక్ష్మి పథకం

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ జిల్లా, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**
లరాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం డిసెంబర్ 9, 2023 నుండి విజయవంతంగా కొనసాగుతోంది. ఈ పథకం ద్వారా మహిళలు విస్తృతంగా ప్రయాణాలు చేసి ఇప్పటివరకు సుమారు 290 కోట్ల ప్రయాణాలు చేసి దాదాపు ?10,000 కోట్ల మేర ఆదా చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి పదివేల కోట్ల రూపాయల మేర ఆదా చేరుకోవడం పై హనుమకొండ బస్ స్టేషన్ లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు జీరో టికెట్ ద్వారా ఉచితంగా ప్రయాణించేందుకు తోడ్పడుతుందని అన్నారు. మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకొని ఆర్థికంగా లాభపడుతున్నారని తెలిపారు. ఈ పథకం తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతోందని, అన్ని వర్గాల మహిళలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిత్యం బస్సుల్లో ప్రయాణించే పలువురు మహిళా ప్రయాణికులను ఆర్టీసీ అధికారులు శాలువాలు, బహుమతులతో సత్కరించారు.జవారిలో మల్లికుదుర్ల నుండి హనుమకొండకు ఉన్నత విద్య కోసం ప్రయాణించే విద్యార్థిని బి కావ్య, స్వీపర్‌గా పనిచేస్తూ ప్రయాణించే పి భాగ్య, వ్యవసాయ పనుల నిమిత్తం ప్రయాణించే ఎస్ హైమావతి, స్వయం సహాయక సంఘ సభ్యురాలు రంజనా, ఖమ్మం నుండి వైద్య సేవల కోసం నిత్యం ప్రయాణించే జి రుక్మిణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజనల్ మేనేజర్ ఎస్ భవాని ప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్స్) కేశరాజు భాను కిరణ్, వరంగల్ వన్ డిపో మేనేజర్ పుప్పాల అర్పిత గారు, సూపర్వైజర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.






## ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభ నిర్వహణ

**డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు**


**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష**




**ములుగు జిల్లా, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**
రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభ నిర్వహించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు మంగళవారం హైదరాబాద్ నుంచి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు, ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామ, వార్డుసభల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణా రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ములుగు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలలో ప్రజలకు అందించే సమాచారం ఒకే రీతిన ఉండాలని, గ్రామ సభలకు వార్డు మెంబర్ నుంచి ఎంపీ, మంత్రుల వరకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు. గ్రామసభలో ముఖ్యమంత్రి సందేశం, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డు, సన్న బియ్యం సరఫరా, గిరిజన రైతులకు ఉచిత పంపు సెట్లు వంటి వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న లబ్ధిదారుల చేత గ్రామ సభలలో మాట్లాడించాలని అన్నారు. జూన్ 2 నుంచి ప్రారంభించే ఇందిరమ్మ జీవిత బీమా పథకం, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అల్పాహార కార్యక్రమంతో పాటు, పాలు, రాగి జావా అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ విస్తృతంగా ప్రచారం జరిగేలా చూడాలని అన్నారు. సాంస్కృతిక శాఖ కళాకారులను ఉపయోగిస్తూ ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్నారు. గ్రామాలకు ప్రభుత్వం భారీ ఎత్తున విడుదల చేసిన నిధులను గ్రామ అభివృద్ధికి వినియోగించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు కలెక్టర్లు సమీక్షిస్తూ విజయవంతంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు. సీఎస్ కె.రామకృష్ణా రావు మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చ్ 6 నుంచి 15 వరకు నిర్వహించిన పెండింగ్ ఫైల్స్ సత్వర పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని, అదే స్ఫూర్తితో ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభలు విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి జిల్లాలో గ్రామ సభలు ఎలా జరుగుతున్నాయి అనే అంశంపై రిపోర్టు అందించాలని కలెక్టర్ లను ఆదేశించారు. గ్రామ సభలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని, స్థానిక ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా గ్రామసభలో ఉండాలని అన్నారు. గ్రామ సభలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియ జేయాలని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభ తరహాలో మున్సిపాలిటీ వార్డులో సైతం సభలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రస్తుత బడ్జెట్ లో ప్రతిపాదించిన వివిధ పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా గ్రామ, వార్డు సభలలో ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలందరికీ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం తెలిసే విధంగా వార్డు సభలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 తేదీన గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని తెలిపారు. గ్రామ, వార్డు సభలు నిర్భహణపై ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్ మరియు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం, జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నియమితులైన ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను తప్పనిసరిగా నిర్వహించి, నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రజలందరూ గ్రామ సభలకు హాజరై తమ అభిప్రాయాలు, సమస్యలను వెల్లడించి, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డి పి ఓ వెంకయ్య, డి ఎం అండ్ హెచ్ ఓ గోపాల్ రావు, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, డి ఏ ఓ సురేష్ కుమార్, సిపిఓ ప్రకాశ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పరిపాలన అధికారి పదవికి వన్నె తెచ్చిన మురళీధర్ రావు

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**



కలెక్టర్ కార్యాలయంలో తలమానికమైన పరిపాలన అధికారి పదవికి వన్నె తెచ్చిన మురళీధర్ రావు అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన ఆర్ మురళీధర్ రావు ఆత్మీయ పదవి విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మురళీధర్ రావు సిన్సియర్, రెస్పాన్సిబుల్ అధికారి అని, విధుల పట్ల ఆయన చూపిన నిబద్ధత, కర్తవ్యం ఇతర ఉద్యోగుల కు ఆదర్శనీయమని ఆయన సేవలను కొనియాడారు. రెవెన్యూ శాఖలో 30 సంవత్సరాలు ప్రజలకు విశిష్ట సేవలు అందించడంలో ఆయన విధులు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం, పారదర్శకతతో పనిచేస్తూ, కార్యాలయ పనితీరును మెరుగుపర్చడంలో కీలకంగా వ్యవహరించారని అన్నారు. ఇలాంటి అంకితభావంతో పనిచేసే అధికారుల వల్లే పరిపాలన వ్యవస్థకు మరింత గౌరవం, విశ్వాసం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మురళీధర్ రావును పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, టిజిఓ కార్యదర్శి సునీల్ కుమార్ టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి షఫీ సర్కార్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంగం అధ్యక్షులు శంకరయ్య, అధికారులు, సిబ్బంది పదవీ విరమణ చేసిన మురళీధర్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం

## సిఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రేవూరి





**పరకాల, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**
లమంగళవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్, పరకాల, నడి కూడా మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 65 మంది లబ్ధిదారులకు 65 లక్షల 7540 వేల రూ విలువగల కళ్యాణ లక్ష్మి మరియు 87 మంది లబ్ధిదారులకు 34 లక్షల 21వేయి రూ విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసామన్నారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా 5660 మందికి 40కోట్ల 39 లక్షల 38వేల 452 రూ విలువగల చెక్కులను పంపిణీ చేశామన్నారు. పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిలుస్తుందని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు దనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు.పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పరకాల ఇందిరా మహిళా డైరీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్,నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరల పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్,సన్న బియ్యం పంపిణీ,మహాలక్ష్మి ,గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు,తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**మహిళలకు ఆర్థిక భరోసా మహాలక్ష్మి పథకం**
**ఉచిత బస్సు ప్రయాణం వెలకట్టలేనిది**
**మహిళా సంఘాలే అసలైన శక్తికి నిదర్శనం**
**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




**ములుగు :** ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మహిళల జీవితాల్లో వెలుగు నింపుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్. తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం ఉత్సవాలు 2026" కార్యక్రమాన్ని నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా 29.03.2026 నాటికి 290 కోట్ల ప్రయాణాల ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా అయ్యాయని వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ములుగు జిల్లాలో ఇప్పటి వరకు 1.90 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు 133.25 కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం పథకాలను రూపొందిస్తుందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు ఈ పథకం ద్వారా కూలీ పనులు చేసుకునే వారు, మధ్యతరగతి మహిళలు మరియు ఉద్యోగినులు ఎంతో లబ్ధి పొందుతున్నారని కలెక్టర్ అన్నారు."గతంలో దూర ప్రాంతాల్లో ఉన్న బిడ్డలను చూడాలంటే ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించేవాళ్లమని, ఇప్పుడు రూపాయి ఖర్చు లేకుండా సాఫీగా ప్రయాణం చేస్తున్నామని" ఒక లబ్ధి పొందిన మహిళ తనతో సంతోషాన్ని పంచుకుందని గుర్తు చేశారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గర్వకారణమని, దీనివల్ల వేల కోట్ల రూపాయల ఆదా చేసుకోగలిగారని హర్షం వ్యక్తం చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో "ఇందిరా మహిళా శక్తి" పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

# పెను ప్రమాదంగా మారిన అమెరికా సామ్రాజ్యవాద పోకడలు

**యుద్ధంతో సమిదలవుతున్న అమాయకులు**
**నరమేదం జరుగుతన్నా మోడి నోరు మెదపరెందుకో**
**సహజ వనరులు దోచుకునేందుకు మావోయిస్టులపై దాడులు**
**కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నిలుపుకోవాలి**
**ప్రజా పోరాటాలే కమ్యూనిస్టు పార్టీకి అజెండా కావాలి**
**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా**



**కొత్తగూడెం:** అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ పోకడలు ప్రపంచ శాంతికి పెనుప్రమాదంగా మారుతోందని, ఈ యుద్ధం భారీ ప్రాణ నష్టానికి, ప్రాంతీయ అస్థిరత్వానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విచ్చిన్నానికి దారితీసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు ఎస్ఆర్ గార్డెన్స్ లో మంగళవారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా, ఇజ్రాయేల్ దేశాలు ఇరాన్ పై ఏకపక్ష యుద్ధం చేస్తున్నాయని, దీని వల్ల అమయాకులు సమిదలవుతున్నారని, సుమారు 3300 మందిని పొట్టన పెట్టుకున్నారని, పసి పిల్లలను కూడా వదల్లేదని మండిపడ్డారు. ఈ నరమేదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసం ఉందన్నారు. భారతదేశ నౌకాదళం పై దాడి జరిగినప్పటికీ, దేశంలో యుద్ధం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నప్పటికీ దేశ ప్రధాని నరేంద్రమోడి కనీసం నోరుమెదపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. విదేశాంగ విధానానికి కట్టుబడ్డ మోడి మానవీయ కోణాన్ని మరిచారని చెప్పారు. అమెరికా ప్రక్కనే ఉన్న క్యూబాపై కూడా కత్తికట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధ కారణంగా దేశంలో పరిస్థితులు క్రమంగా మారిపోతున్నాయని, ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలతో పాటు ఇతర నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ అగార్ పేరుతో 3 వేల మంది మావోయిస్టులను ప్రభుత్వం హతమార్చిందని, కేంద్ర పోకడల కారణంగా అనేక మంది లొంగి పోతున్నారని చెప్పారు. చర్చలకు రానివ్వకుండా మారణహోమం సృష్టిస్తూ భయానక వాతావరణాన్ని కల్పించారని చెప్పారు. మావోయిస్టు రహిత భారతాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పిన కేంద్రం ఆ దిశగా సత్ఫలితాలు సాధించామంటూ చెప్పుకుంటుందని అన్నారు. అడవుల్లో నిక్షిప్తమైన ఉన్న సహజ వనరులను దోచుకునేందుకు కేంద్రం మావోయిస్టులను అడవుల నుండి బయటకు పంపుతోందని, అదానీ, అంబానీలకు అక్కడి సంపదను కారు చౌకగా కట్టబెట్టేందుకు బిజిపి చూస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వల పనితీరుపై ప్రశించే వారిని అర్బన్ నక్సలైట్లు అంటూ ముద్రవేసి వేదింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే పెను ప్రమాదం ముంచుకొస్తోందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలన్నారు. రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు, రైతు రుణ మాఫీ తూతూ మంత్రంగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను ప్రభుత్వం నిర్లక్షం చేస్తోందని, కార్మికుల హక్కులను కాలరా స్తూ ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సేవ్ సింగరేణి పేరుతో సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి కార్యక్రమం విజయ వంతమైందని, దీంతో ప్రభుత్వా నికి తమ సత్తా ఎంటోచాటామని తెలిపారు. సింగరేణి కార్మికుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల విధానాన్ని అవలంభిస్తోందని తెలిపారు. రాజకీయ సయోధ్యకు తాము కట్టుబడే ఉన్నామని, కానీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసేందుకు వెనుకంజ వేసేదే లేదని స్పష్టం చేశారు. కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, జర్నలిస్టుల సమస్యలపై శాసన సభ్యులు కూనం నేని సాంబశివరావు తన గళాన్ని అసెంబ్లీలో వినిపిస్తున్నారని, చట్ట సభల్లో మన ప్రాతినిధ్యం పెంచుకునేందుకు కృషి చేయాలన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటిరిగా బరిలోకి దిగి తమ సత్త ఎంటో చాటామని, కమ్యూనిస్టులను తక్కువ చేసి చూసిన, మాట్లాడిన వాళ్ల నోళ్లు ఎల్లబెట్టుకునే ఫలితాలు సమిష్టిగా రాబట్టడ గలిగామన్నారు. రానున్న జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిద్దామని తెలిపారు. జి వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వర రావుతో పాటు కే సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, ఎస్టి సలీం, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళీ, మువ్వా వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, అడుసుమిల్లి సాయిబాబా, ఎస్ కే ఫహీం దాదా డి శంకర్ బంధం నాగయ్య మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2 నుంచి గ్రామసభలు పెద్ద ఎత్తున నిర్వహించాలి



**మహబూబాబాద్ జిల్లా, మార్చి 31 (తీన్మార్ న్యూస్):**
ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జూన్ 2 నుంచి అమలు చేయబోతున్న కొత్త పథకాల గురించి వివరించాలి. ప్రజా పాలన –ప్రజా ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక) పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, ప్రజా పాలన –ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల విచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు.
గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు.
ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ మరియు ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి

నరసరావుపేట – గుంటూరు ప్రధాన రహదారిపై మంగళవారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మృతులను పల్నాడు జిల్లాలోని గుండాలపాడు గ్రామానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. ప్రమాద ధాటికి బాధితులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఎలా జరిగిందో దర్యాప్తు చేపట్టారు . మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో గుండాలపాడు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## రొయ్యూరు గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

**మన ఊరు – మన బాధ్యత**
**నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు అత్యంత అవసరం ఏటూరనాగారం ఎస్సై మహేష్**

**ఏటూరు నాగారం :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు గ్రామపంచాయతీలో మంగళవారం గ్రామ సర్పంచ్ కావిరి అర్జున్ అధ్యక్షతన "మన ఊరు మన బాధ్యత" 99రోజుల గ్రామ ప్రణాళిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో యువత, గ్రామ ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంనికి స్థానిక ఎస్సై మహేష్ హాజరై మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని సూచించారు. గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రొయ్యూర్ గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దుతూ, ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని ఎస్ఐ పేర్కొన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసుల పని చేస్తుందని, నేరస్తులను గుర్తించడంలో అవి కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. రొయ్యూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కావిరి అర్జున్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని, అన్ని రంగాల్లో రొయ్యూర్ ముందంజలో నిలపాలని పిలుపునిచ్చారు.

## హుజూర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**హుజూర్నగర్ ::** నూతన పాలకవర్గం హుజూర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. హుజుర్ నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026 – 27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై మంగళవారం హుజుర్ నగర్ మున్సిపాలిటీ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి, సత్ఫలితాలు రాబట్టలని కోరారు. మున్సిపాలిటీ 2026 –27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందించడం జరిగిందని వివరించారు. హుజుర్నగర్ మున్సిపాలిటీని దశల వారీగా అభివృద్ధి చేసుకునేందుకు పాలక వర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన త్రాగునీరు, పరిశ్శుధ్యం, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఆర్డిఓ కు సూచించారు వార్డులలోని ముఖ్యమైన ప్రదేశాలలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే మహిళ భద్రత కల్పించడం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారుపట్టణాన్ని పరిశుభ్రంగా మరియు అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో



# సల్మాన్ ఖాన్ వంశీ పైడిపల్లి సినిమాలో హీరోయిన్‌గా నయనతార!

ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో మరో భారీ క్రేజీ కాంబినేషన్ సెట్ అయింది. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా పరిచయం చేశారు మేకర్స్. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో కథానాయికగా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, శిరీష్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దిల్ రాజు నిర్మాణ సంస్థకు ఇది 63వ చిత్రం కావడం విశేషం. ఈ అప్‌డేట్‌ను వెల్లడిస్తూ.. ాఎజ63 ప్రాజెక్ట్‌లోకి ది క్వీన్ అడుగుపెట్టింది.. ఎంతో ప్రత్యేకంగా తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లోకి నయనతారను ఆహ్వానించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని చిత్ర బృందం రాసుకోచ్చింది. నయనతార ఇప్పటికే షారుఖ్ ఖాన్ సరసన 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టి రికార్డు స్థాయి బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు మరోసారి బాలీవుడ్ అగ్ర హీరో అయిన సల్మాన్ ఖాన్‌తో ఆమె జతకట్టడం భారతీయ సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ముగ్గురు దిగ్గజాలైన సల్మాన్ ఖాన్, నయనతార మరియు వంశీ పైడిపల్లి కలయికలో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. దర్శకుడు వంశీ పైడిపల్లి గతంలో దళపతి విజయ్ సరసన 'వారసుడు' (వారిసు) సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు సల్మాన్ ఖాన్‌ను ఆయన ఎలాంటి సరికొత్త కథతో చూపించబోతున్నారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర బృందం త్వరలోనే అధికారికంగా వెల్లడించనుంది.




# నేను ఈ క్యారెక్టర్ చేయగలనని నమ్మిన ప్రతీ ఒక్కరికి థాంక్యూ

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా వస్తున్న లేటెస్ట్ లవ్ ఎంటర్‌టైన్ మూవీ 'చెన్నై లవ్ స్టోరీ'. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు.రవి నంబూరి దర్శకత్వం వహిస్తుండగా.. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశలో ఉంది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం..తాజాగా 'గుర్తుందా' సాంగ్ రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంఛ్ ఈవెంట్‌లో పాల్గొన్న హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ తన పాత్రపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'గ్లింప్స్ రిలీజైనప్పటి నుంచి చెన్నై లవ్ స్టోరీ మూవీ మీద చాలా అంచనాలు ఏర్పడుతున్నాయి. ఈ సినిమాలో కిరణ్‌తో కలిసి వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. ఆయన ఈ చిత్రం తర్వాత మరింత గొప్ప ఇమేజ్ తెచ్చుకుంటారు. అలాగే ఈ మూవీలో ఇంత బరువైన, ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్ నేను చేయగలను అని నమ్మిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్ చెబుతున్నా. మణిశర్మ సంగీతంలో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నా' అని చెప్పుకొచ్చింది.


# నా డ్రీమ్ అదే.. రాకాస ఈవెంట్‌లో నిహారిక

మెగా డాటర్ నిహారిక నటిగా రాణిస్తూనే నిర్మాతగా కూడా దూసుకెళ్తున్నారు. కమిటీ కుర్రోళ్లు మూవీ తర్వాత నిర్మాతగా బిజీ అయిపోయారు. ప్రస్తుతం తన సొంతం బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై రాకాస అనే మూవీని నిర్మించారు. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా వస్తోన్న ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం ఏప్రిల్ 03న థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన నిహారిక నిర్మాతగా తన అనుభవాలను పంచుకుంది. ఇలాంటి సినిమా తీస్తున్నామనగానే చాలామంది సలహాలు ఇచ్చారని తెలిపింది. వీఎఫ్ఎక్స్ విషయంలో పెద్ద పెద్ద సినిమాలే కష్టపడాల్సి వస్తోంది.. మీది చిన్న బడ్జెట్ సినిమా.. చాలా ఇబ్బంది పెడతారు చూసుకోండని నాతో చెప్పారని గుర్తు చేసుకుంది. ఏం చేసినా మాటలు అనే వాళ్లు అంటూనే ఉన్నారు. అందుకే నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటానని తెలిపింది. ఓ మంచి సినిమా తీశాం.. జనాల్లోకి తీసుకెళ్లడానికి బాగా ప్రమోట్ చేస్తున్నామని నిహారిక వెల్లడించింది. ఇంటింటికి వెళ్లి సినిమా చూపించడానికి కూడా రెడీగా ఉన్నామని నిహారిక పేర్కొంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో భాగమైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు, కారు ఉండాలని ఆశిస్తున్నట్లు నిహారిక తన డ్రీమ్‌ను బయటపెట్టింది. కమిటీ కుర్రోళ్లు మూవీతో 11 మంది కొత్త వాళ్లను పరిచయం చేశానని నిహారిక తెలిపింది.





# ఆదర్శ కుటుంబంలో అదే మెయిన్ హైలైట్..




విక్టరీ వెంకటేశ్, డైరెక్టర్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ చిత్రం 'ఆదర్శకుటుంబం'. చాలా కాలం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నాయి.అనౌన్స్‌మెంట్ నుంచే ఈ చిత్రంపై సూపర్ బజ్ క్రియేట్ కాగా.. సమ్మర్ స్పెషల్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ మేరకు సైలెంట్‌గా షూటింగ్ కూడా కానిచ్చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఈ మేరకు "ఆదర్శకుటుంబం'లో ప్రీ-క్లైమాక్స్‌లో వచ్చే స్పెషల్ కామెడీ ఎపిసోడ్ ప్రధాన హైలైట్‌గా నిలవనుందని సమాచారం. వెంకీ కామెడీ టైమింగ్, త్రివిక్రమ్ పంచ్ డైలాగ్స్ కలిసి మళ్లీ నవ్వుల పండుగ తెచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ఇక త్రివిక్రమ్ మార్క్ రైటింగ్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఈ సినిమాకు బలం కానున్నాయి. సమ్మర్ రిలీజ్ టార్గెట్ చేస్తూ, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు' అంటూ ఓ పోస్ట్ వైరల్ కాగా.. వెయిటింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.

# ఫాంటసీ థ్రిల్లర్‌లో స్వీటీ.. ట్రైలర్ చూశారా?

బాహుబలి సినిమాలతో పాన్ ఇండియా క్రేజ్ సొంతం చేసుకున్న అనుష్క శెట్టి.. బరువు సమస్యల కారణంగా తర్వాత మూవీస్ చేయడం చాలా తగ్గించేసింది. అప్పుడో ఇప్పుడో అన్నట్లు చేస్తూ వస్తోంది. 2023లో 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో హిట్ అందుకున్న ఈ హీరోయిన్.. గతేడాది 'ఘాటీ'తో ఘోరమైన డిజాస్టర్ చవిచూసింది. ఇప్పుడు 'కథనార్' అనే మలయాళ చిత్రంతో వచ్చేందుకు సిద్ధమైంది. ఫాంటసీ థ్రిల్లర్ స్టోరీతో తీసిన ఈ సినిమాని తెలుగు, తమిళంలోనూ రిలీజ్ చేయనున్నారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. ఇందులో అనుష్కకి రెండు మూడు షాట్స్‌కి మాత్రమే పరిమితం చేశారు. విజువల్స్ బాగున్నాయి గానీ కాన్సెప్ట్ అర్థమై అర్థం కానట్లు అనిపించింది. డబ్బింగ్‌లో ఉపయోగించిన తెలుగు పదాలు కూడా సగటు ప్రేక్షకుడికి అర్థం కాని విధంగా ఉన్నాయి. జయసూర్య హీరోగా నటించిన ఈ చిత్రంలో అనుష్క శెట్టి హీరోయిన్. ప్రభుదేవా, శాండీ మాస్టర్, వినీత్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ ఏడాది జూలై ఆగస్టులో థియేటర్లలోకి మూవీ రానుందని తెలుస్తోంది. రోజిన్ థామస్ దర్శకుడు. అనుష్కకి ఇది 50వ మూవీ కావడం విశేషం.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463